



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY






సంపుటి 10 | సంచిక 280 | కర్నూలు | గురువారం నవంబర్ 06 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏపీ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్




అమరావతి, నవంబరు5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో అమరావతి సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం (ఊఓ... గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్) సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్య కుమార్ యాదవ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై మంత్రులు మాట్లాడుతున్నారు. జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం (గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్) ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది. ఈరోజు మంత్రుల బృందం సమావేశమై తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది. ఈ నెల 10వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కీలక చర్చలు జరిపి మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి.

# అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టండి..

## అధికారులకి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

అమరావతి, నవంబరు5 : ఏపీలో జరుగనున్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఏపీ సచివాలయంలో మొంథా తుపాను నష్టం, అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకి డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదిపై హై లెవెల్ వంతెనతో దీవుల్లోని గ్రామాలు అనుసంధానం చేసేలా వంతెన నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు పవన్ కల్యాణ్. ఏపీ ప్రభుత్వ నిధులతోపాటు, సాస్కీ పథకం నిధులు మంజూరుకు నిర్ణయం తీసుకున్నామని



వివరించారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో అవనిగడ్డ పరిధిలో అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పుకొచ్చారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిన అభివృద్ధి పనులకూ మోక్షం లభించనుందని తెలిపారు. మొంథా తుఫానులో నష్టపోయిన కౌలు రైతుల వివరాలతో వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులకి ఆదేశాలు జారీ చేశారు పవన్ కల్యాణ్.

# ఏపీలో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు.. ఆరుగురు అరెస్ట్

కడప, నవంబరు5 : ఆన్‌లైన్ యాప్ ద్వారా బెట్టింగ్ ) నిర్వహిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టు చేశారు కడప జిల్లా పోలీసులు పొద్దుటూరులో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కి పాల్పడుతున్న ఆరుగురు బెట్టింగ్ ముఠా సభ్యులని అరెస్టు చేశారు. ఈ క్రమంలో బెట్టింగ్ ముఠా సభ్యులపై బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఆరుగురు క్రికెట్ బుకీల దగ్గరి నుంచి రూ. 6.28 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లు, బ్యాంక్ పాస్ బుక్‌లని స్వాధీనం చేసుకున్నారు కడప జిల్లా పోలీసులు. ఈ కేసుకి సంబంధించిన వివరాలను



మీడియాకు కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. బెట్టింగ్ ముఠా సభ్యులని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారీగా ఫేక్ కరెంట్ బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయిస్తూ బెట్టింగ్ వెబ్‌సైట్‌కు లింక్ చేసి, క్రికెట్ బెట్టింగ్ ద్వారా ఆర్థిక నేరాలకు బెట్టింగ్ ముఠా సభ్యులు పాల్పడుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన వెబ్‌సైట్, యాప్‌లపై గట్టి నిఘా ఉంచామని కడప ఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా తమ నిఘా నుంచి తప్పించుకోలేరని కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు.

# తెలుగు తమ్ముళ్లు క్రమశిక్షణతో పని చేయాలి..

## పల్లా శ్రీనివాసరావు కీలక ఆదేశాలు

అమరావతి, నవంబరు5 : తెలుగు తమ్ముళ్లు క్రమశిక్షణతో పని చేయాలని తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. నేతలు ఎవరైనా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇకపై ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించాలని సూచించారు. అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో పల్లా శ్రీనివాసరావు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తమ్ముళ్లకి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు పల్లా శ్రీనివాసరావు. ఈనెల 15వ తేదీలోపు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ కమిటీల వరకు



నియామకాలు పూర్తి కావాలని హుకుం జారీ చేశారు. కూటమి నాయకులతో సఖ్యతగా, సమష్టిగా ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆజ్ఞాపించారు. మంగళగిరి నియోజకవర్గంలో గ్రీవెన్స్‌ని సరిగా ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజా సమస్యలపై సరైన రీతిలో పరిష్కరించి ఉంటే మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజాదర్బార్‌కు నాలుగు వేల మంది ఎందుకు వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు పల్లా శ్రీనివాసరావు. నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలని ఆజ్ఞాపించారు. ఇక అదే రోజు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నవంబరు 15వ తేదీలోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామ స్థాయి కమిటీల వరకు పార్టీ నియామకాలు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. 15వ తేదీలోపు పూర్తి చేయలేకపోతే టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎదుట ఆయా నేతలు హాజరుకావాల్సి ఉంటుందని పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు.


# తొమ్మిది రోజుల తర్వాత పరామర్శలా... జగన్‌పై కొల్లు రవీంద్ర సీరియస్

కృష్ణా జిల్లా, నవంబర్ 5: మాజీ సీఎం వైఎస్ జగన్ కృష్ణా జిల్లా పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పర్యటనలో ఎక్కడా కూడా రైతులు కనిపించలేదన్నారు. తాను పర్యటిస్తున్న ప్రాంతాల్లో రైతులు లేక పక్క గ్రామాల నుంచి రైతులను తెప్పించుకుని జగన్ పబ్లిసిటీ స్టంట్లు చేశారని విమర్శించారు. పొలం గట్ల మీద నడిచి ఫోటోలకు స్టిల్స్ ఇచ్చారని కామెంట్స్ చేశారు. తుఫాను తీరం దాటిన తొమ్మిది రోజుల తర్వాత పరామర్శ పేరుతో జగన్ రాజకీయ డ్రామా సృష్టించారని వ్యాఖ్యలు చేశారు. జగన్ పర్యటన ఆద్యంతం పచ్చి అబద్ధాలతో సాగిందని ఆరోపించారు. జగన్ మాట్లాడిన మాటల్లో ఒక్క నిజం కూడా లేదని... కేవలం ప్రభుత్వం మీద బురదజల్లేందుకే జగన్ ప్రయత్నించారని మండిపడ్డారు. జగన్ దిగిన పొలాల్లో ఎక్కడా కూడా వర్షపు నీరు నిలిచిలేదని అన్నారు. పంట కాలువలను బాగు చేయడం వల్లే పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు ఎప్పటికప్పుడు కాలువల గుండా వెళ్లిపోయిందన్నారు. ఫలితంగా రైతులు చాలా వరకు నష్టపోకుండా చూడగలిగామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువల్లో మట్టి కూడా తీయలేదని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్‌లపై విమర్శలు చేసే అర్హత జగన్‌కు లేదన్నారు. తల్లిని చెల్లిని పట్టించుకోని వ్యక్తి జగన్.. చంద్రబాబుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీజీఎస్ నుంచి తుఫాను సహాయ చర్యలపై చంద్రబాబు, లోకేష్ నిరంతరం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని తెలిపారు. తుఫాను తీరం దాటిన మరుసటి రోజే ఏరియల్ సర్వే ద్వారా పంట నష్టాన్ని సీఎం



చంద్రబాబు చూశారన్నారు. ఆ మరుసటి రోజే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షేత్ర పర్యటన చేసి పంట నష్టం అంచనాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.82 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాలు తయారు చేశామన్నారు. పంట నష్టం నమోదుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి చెప్పారు. ప్రాణ నష్టం లేకుండా ప్రభుత్వ యంత్రాంగం విశేషంగా కృషి చేసిందని అన్నారు. తుఫాను సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాహితంగా పని చేశారని అభినందించారు. పని చేసే అధికారులను అవమానపర్చే విధంగా జగన్ మాట్లాడిన తీరు గర్హనీయమని మండిపడ్డారు. ఐదేళ్లలో వైసీపీ చేసిన ధర స్థిరీకరణ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో క్రాప్ హాలిడే ప్రకటించిన రోజులను జగన్ ఒకసారి గుర్తు తెచ్చుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.


# 7వ తేదీ నుంచి ఆపరేషన్‌లోకి నిసార్ ఉపగ్రహం : ఇస్రో చీఫ్



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చైర్మెన్ వీ నారాయణన్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. అమెరికాకు చెందిన నాసాతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేసి ప్రయోగించిన నిసార్ ఉపగ్రహం నవంబర్ 7వ తేదీ నుంచి ఆపరేషన్‌లోకి వస్తుందన్నారు. నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రేడార్(ఎన్ఐఎస్ఏఆర్) అత్యంత ఖరీదైన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్. భూగ్రహంపై ఉన్న మంచు కేంద్రాలను ప్రతి 12 రోజులకు రెండుసార్లు మానిటర్ చేసే సామర్థ్యం ఆ ఉపగ్రహానికి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. జూలై 30వ తేదీన జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆ శాటిలైట్‌ను ప్రయోగించారు. నిసార్ బరువు సుమారు 2400 కేజీలు. డేటా సమీకరణ పూర్తి అయ్యిందని, నవంబర్ 7వ తేదీన జరిగే భేటీలో శాటిలైట్‌ను అపరేషనల్‌గా ప్రకటించనున్నట్లు నారాయణన్ అన్నారు. ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. నిసార్ శాటిలైట్‌లో రెండు సార్ సిస్టమ్స్ ఉన్నాయి. ఒకటి ఎల్ బ్యాండ్. మరొకటి ఎస్ బ్యాండ్ సెన్సార్. ఎల్ బ్యాండ్ రేడార్.. అడవును స్కాన్ చేసి అక్కడ నేత సాంద్రతను, ఫారెస్ట్ బయోమాస్, ఐస్ సర్ఫేస్‌ను అంచనా వేస్తుంది. ఇక ఎస్ బ్యాండ్ రేడార్.. వ్యవసాయ, గ్రాస్‌ల్యాండ్ ఎకోసిస్టమ్, మంచు తేమను స్టడీ చేయనున్నది.

# ఒకే ఫొటోతో ఒకే అసెంబ్లీ స్థానంలో 100 ఓట్లు ఎలా ఉంటాయి: రాహుల్ గాంధీ

ఛండీగఢ్: ఓట్ చోరీపై హెచ్ ఫైల్స్ పేరుతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు చేశారు. హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు గుప్పించారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఓట్లలో భారీ అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులు అందాయన్నారు. పోలైన పోస్టల్ ఓట్లకు, ఫలితాలకు చాలా తేడా ఉందన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోనూ భారీగా ఓట్ల చోరీ జరిగిందని దుయ్యబట్టారు.



హర్యానాలో ఒక యువతికి 10 బూత్‌లలో 22 ఓట్లు ఉన్నాయని ఫొటోలను రాహుల్ చూపించారు. సీమా, స్వీటీ, సరస్వతి.. ఇలా వివిధ పేర్లతో ఒకే యువతికి అన్ని ఓట్లు ఎలా ఉంటాయని అడిగారు. సదరు యువతిని బ్రెజిల్‌కు చెందిన మోడల్‌గా గుర్తించామని వివరించారు. హర్యానాలో 2 కోట్ల ఓటర్లు ఉన్నారని, 25 లక్షల ఓట్లను దొంగలించారని ఆరోపణలు చేశారు. ఒకే ఫొటోతో ఒకే అసెంబ్లీ స్థానంలో 100 ఓట్లు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. ఓ మహిళ పేరుతో రెండు పోలింగ్ కేంద్రాల్లో 223 ఓట్లు ఎలా ఉంటాయని నిలదీశారు. హర్యానాలో గెలుస్తామని అన్ని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, అయినప్పటికీ ఫలితాలు తారుమరయ్యాయని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశార్లు. పర్యాటక గైడ్లు లైఫ్ స్టైల్ క్రీడా వస్తువులు వార్తా యాప్ ప్రీమియం రాజకీయ విశ్లేషణ కోర్సులు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ కోర్సులు సినిమా వార్తలు టెక్నాలజీ ట్రెండ్స్ సంపాదకీయ వ్యాసాలు తెలంగాణ వార్తలు హర్యానాలో ఐదు లక్షలకు పైగా డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని ధ్వజమెత్తారు. తప్పుడు చిరునామాలతో 93 వేలకు పైగా ఓట్లు ఉన్నాయని, ఇన్ని అక్రమాలు జరుగుతుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బిజెపికి లబ్ధి కలిగించేందుకు ఇలా వ్యవహరించారని మండిపడ్డారు.

# రాష్ట్రం నుంచి జగన్‌ను తరిమికొట్టాలి..

విజయవాడ: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని.. అలాగే జగన్‌కూ సూపర్ చెక్ పెట్టబోతున్నామని చెప్పారు. జగన్‌కు అధోగతి తప్పదన్నారు. జగన్ బతుకును ఘోరం చేస్తామంటూ ధ్వజమెత్తారు. ప్రజలే ఛీ కొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయని విమర్శించారు. భారతి రెడ్డి రూ. 400 కోట్లు బంగారం కొన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో జగన్.. భారతి రాజ్యాంగాన్ని అమలు చేశారని ఆదినారాయణ రెడ్డి ఆరోపించారు. పులివెందుల ఎన్నికలలో జగన్‌ను ప్రజలు తరమికొట్టారని పేర్కొన్నారు. బడ్జెట్ అంటే అక్షయపాత్ర కాదు.. కల్పతరువు కాదు.. ఆ మాత్రం తెలియకుండా జగన్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గూగుల్ డేటా సెంటర్ వస్తే జగన్ ఓర్వలేక పోతున్నారన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంతోమంది పాత్ర ఉందని చెప్పారు. అసలు దోషులు దాగి ఉన్నారు.. వారికోసం సీబీఐకి కేసు అప్పగించాలని సూచించారు.


# సంపాదకీయం

## దిగాజారుతున్న అగ్రరాజ్యం...

రాబోయే పదేళ్లలో రక్షణ రంగంలో సహకారం పెంపొందించుకోవడానికి వీలైన మౌలిక విధానంపై భారత్, అమెరికా మధ్య ఒక ఒప్పందం కుదిరింది.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య కౌలాలంపుర్‌లో జరిగిన సమావేశం తర్వాత ఈ ఒప్పందాన్ని ప్రకటించారు.'ఈ ఒప్పందం సమన్వయం, సమాచార మార్పిడి, సాంకేతిక సహకారాన్ని పెంపొందిస్తుంది. ప్రాంతీయ స్థిరత్వాన్ని పెంచుతుంది. సంఘర్షణలు పెరగకుండా నివారిస్తుంది' అని పీట్ హెగ్సేత్ ఎక్స్‌లో రాశారు.అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాక, ఉద్రిక్తంగా మారిన సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నవేళ, రెండుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్న సమయంలో ఈ ఒప్పందం కుదిరింది.ట్రంప్ టారిఫ్‌లలో రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు జరిమానాగా విధించిన 25 శాతం కూడా కలిసి ఉంది.'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో ఈ ఒప్పందం ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ అనేది మూల స్తంభంగా ఉంటుంది. స్వేచ్ఛాయుత, బహిరంగ, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడానికి ఈ ఒప్పందం చాలా ముఖ్యం' అంటూ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ఒప్పందం గురించి సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.రెండు దేశాల మధ్య టారిఫ్ వివాదాల ప్రభావం గురించి యురేషియా గ్రూప్ థింక్ ట్యాంక్ ప్రమిత్ పాల్ చౌధరిని బీబీసీ ప్రతినిధి షెర్లిన్ మోలాన్ ప్రశ్నించారు.'ఈ ఒప్పందం ఈ ఏడాది జులై-ఆగస్టులో పూర్తి కావాల్సింది. కానీ, పాకిస్తాన్‌తో సంఘర్షణను ముగించానంటూ ట్రంప్ చేసిన ప్రకటనలపై భారత్ అసంతృప్తి చెందడం వల్ల అది ఆలస్యమైంది' అని ప్రమిత్ పాల్ అన్నారు.రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాల శ్రేణిలో ఇది తాజా ఒప్పందమని ప్రమిత్ పాల్ వ్యాఖ్యానించారు.'ఈ ఒప్పందం రెండు దేశాల సైన్యాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది. భారత్‌కు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. రక్షణ రంగంలో రెండు దేశాల సైన్యాలు కలిసి పనిచేయడం సులభమవుతుంది' అని ఆయన అన్నారు.ఇటీవలి కాలంలో భారత్, అమెరికా తమ రక్షణ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో జరిగిన చర్చల్లో రక్షణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది.భారత్‌కు సైనిక సామగ్రి విక్రయాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతానని, దీంతో భారత్‌కు ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలు లభించే మార్గం తెరుచుకుంటుందని ట్రంప్ అన్నారు.కానీ అప్పటి నుంచి, రష్యా నుంచి చౌకగా భారత్ చమురును కొనడం, రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల రక్షణ సంబంధాలు ట్రంప్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించే అంశాలుగా మారాయి.రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఎంత ముఖ్యమైనదని సనా హాష్మీని ఆయన అడిగారు.'ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ట్రంప్ ట్వీట్లకు, ఆయన సోషల్ మీడియా కార్యకలాపాలకు మనం చాలా ప్రాముఖ్యం ఇస్తున్నామని అనుకుంటున్నా. వీటి ఆధారంగానే మనం భారత్-అమెరికా సంబంధాలను అంచనా వేస్తున్నాం. రెండు దేశాల మధ్య సంబంధాల్లో చీలిక ఏర్పడిందని చెబుతున్నాం. ఎవరైనా ఒక నాయకుడి మూలంగా ఒక రెండు దేశాల సంబంధాలు పెద్దగా ప్రభావితం కావు. ట్రంప్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడున్న పరిస్థితి మారుతుంది' అని సనా హాష్మీ అభిప్రాయపడ్డారు.దక్షిణ కొరియాలో డోనల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమయ్యారు.చైనాపై విధించిన 'ఫెంటానిల్ టారిఫ్' లను కుదిస్తున్నట్లు ఆ సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ షీ జిన్‌పింగ్ కలుసుకున్నప్పటికీ వారిద్దరి మధ్య సంబంధాలు సానుకూల దిశలో వెళ్తున్నాయని మనం చెప్పలేం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు భారత్ సహాయం చాలా అవసరం. ఇప్పటికీ అమెరికా దృష్టిలో భారత్ ప్రాధాన్యం చెక్కుచెదరకుండా అలాగే ఉంది.భారత్ పట్ల అమెరికా ఇప్పటికీ సానుకూలంగా ఉందని చెప్పడానికి తాజాగా కుదిరిన ఈ ఒప్పందమే నిదర్శనం. సుంకాల వివాదం, రష్యాతో భారత్ సంబంధాల తర్వాత కూడా భారత్‌తో అమెరికా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ట్రంప్ ఏం చెప్పినా రెండు దేశాల మధ్య రక్షణ సంబంధాలు పెరుగుతూనే ఉంటాయి. ఈ ఒప్పందం భారత్ కంటే అమెరికాకే చాలా ముఖ్యమని భావిస్తున్నా' అని సనా హాష్మీ అన్నారు.రష్యా ఇప్పటికీ భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఉంది. అయితే, భారత్ ఆయుధాల్లో వైవిధ్యాన్ని, దేశీయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నందున భారత రక్షణ కొనుగోళ్లలో రష్యా వాటా క్రమంగా తగ్గుతోంది.అమెరికా నుంచి చమురు, రక్షణ కొనుగోళ్లను పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ ఇటీవల సంకేతాలు ఇచ్చింది.ప్రస్తుతం భారత్, అమెరికా అత్యంత కీలకమైన వాణిజ్య ఒప్పందంలో నిమగ్నమై ఉన్నాయి. నవంబర్‌లో ఒక ఒప్పందానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చాలా కాలంగా దీనికోసం ఎదురుచూస్తున్నాయి.రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు 'శిక్ష'గా అభివర్ణిస్తూ ఈ ఏడాది ఆగస్టులో భారత దిగుమతులపై అమెరికా 50% సుంకం విధించింది.భారత్ ఈ విషయంలో జాగ్రత్తగా స్పందించింది. దేశీయ వినియోగదారుల ప్రయోజనాల కోసమే చమురు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంది.రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ అతి త్వరలో గణనీయంగా తగ్గిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తనతో చెప్పారని ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేక సార్లు అన్నారు.భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. నిరుడు రష్యా నుంచి 52.7 బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురును కొనుగోలు చేసింది.

## వి హెచ్ పి-బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు





కర్నూలు, నవంబర్ 5 (శ్రీచక్ర): హతాత్మ దివాన్ నీ పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ - బజరంగ్దళ్ ఆధ్వర్యంలో అమిలియా హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ.తాండ్రపాడు గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మెగా ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో గ్రామస్తులు చాలామంది పాల్గొని వారికి సంబంధించిన వ్యాధులకు ఉచిత పరీక్షలు మరియు మందులు పొందారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయి రెడ్డి, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజులు, కర్నూలు జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు, కర్నూలు జిల్లా సమరతాసత ప్రముఖ్ నవీన్ కర్నూలు జిల్లా బజరంగ్దళ్ సహ సంయోజన తేజ, కర్నూలు జిల్లా గోరక్ష ప్రముఖ మరియు కర్నూల్ గ్రామీణ ప్రఖండ ప్రబారి బెస్త పరశురాముడు, కర్నూల్ గ్రామీణ ప్రఖండ కార్యదర్శి శ్రీరాములు కర్నూలు, గ్రామీణ ప్రఖండ బజరంగ్దళ్ సంయోజక్ సోమనాథ్, గ్రామీణ సేవా ప్రముఖ్ సాయికిరణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమిలియా హాస్పిటల్ సిబ్బందితో కలిసి శ్రీరాములు, బెస్త పరశురాముడు, సోమనాథ్, సాయికిరణ్, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే శ్రీశ్రీశ్రీ నీలకంటేశ్వర స్వామి దేవాలయంలో గత 25 సంవత్సరాలుగా నిర్విరామంగా స్వామివారి యొక్క అనుగ్రహంతో అమ్మవారి యొక్క కృపతో భక్తాదుల సహాయ సహకారాలచే కార్తీక పౌర్ణమి (103 లో పౌర్ణమి) కార్యక్రమం నిర్వహించబడుతున్నది ఈ సంవత్సరం కూడా గాయత్రీ యజ్ఞము అమ్మవారికి లలితా సహస్రనామ స్తోత్రం తో కుంకుమార్చన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నవి మధ్యాహ్నం మహాన్నప్రసాదం వితరణ జరిగింది.అలాగే సాయంకాలం దీపోత్సవ కార్యక్రమం కూడా జరిగింది.


## రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువులకు ఫెర్టిలిటీ క్యాంపు మరియు రైతులకు అవగాహన సదస్సు



వరదయ్యపాలెం,నవంబరు 05(శ్రీచక్ర)రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్ జి యం)అనేది 2014లో ప్రారంభించబడిన భారత ప్రభుత్వ పథకం, దీని ప్రధాన లక్ష్యం దేశీయ గోవు జాతులను సంరక్షించడం, అభివృద్ధి చేయడం మరియు వాటి పాల ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచడం. దీని ద్వారా దేశీయ జాతుల జన్యు మెరుగుదల,శాస్త్రీయ పశుపోషణ పద్ధతుల ప్రోత్సాహం మరియు గ్రామీణ రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం గ్రామములో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వెటర్నరీ అధికారులు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార పద్ధతులు, కృత్రిమ గర్భధారణ (ఆర్టిఫిషల్ ఇన్సమినేషన్) ప్రాధాన్యతపై వివరించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా అధిక ఉత్పత్తి ఇచ్చే జాతులను ప్రోత్సహించడం, రైతులకు ఉచిత సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు.సదస్సులో పశుసంవర్ధక శాఖ అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే మునిరాజా, డి ఎల్ డి ఏ డాక్టర్ సి హెచ్ సుబ్బారావు, డాక్టర్ బి ఎస్ ఎన్ అశ్విని,, డాక్టర్ బి గౌరీ, జె మాణిక్యం, బి పవన్, జి జితేంద్ర, సాయి ప్రదీప్, అరుల్, చిరంజీవి,స్థానిక రైతులు,గ్రామ పశు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఇందులో గర్భ కోశవ్యాదులు,నట్టల నివారణ,గోమారులు పై చికిత్స పశువులకు అందించినట్టు పశు వైద్యాధికారి గౌరి తెలిపారు.వీరిని డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు ప్రశంసించారు.

## ప్రజల్ని మౌఢ్యం లో ముంచి దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ వ్యక్తులను ప్రతిఘటించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపు




మార్కాపురం నవంబర్ 5 శ్రీ చక్రమార్కాపురం మతోన్మాదుల అండతో ప్రజల్ని మౌఢ్యం లో ముంచి దేశ సంపదను కార్పొరేట్ శక్తులు అడ్డగోలుగా దోచుకుంటున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్ లోవ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు బుధవారం జరిగాయి. జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ తరగతులలో "మతం మతోన్మాదం కార్పొరేట్ల కలయిక" అనే అంశంపై సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రం లోని మోడీ ప్రభుత్వం అబద్ధాలు, అసత్యాలతోప్రజల్నిమభ్యపుచ్చుతూ మోసపు మాటలతో పరాదీనత వైపు నడిపిస్తున్నదని అన్నారు. చరిత్రను వక్రీకరించి మత, మూఢ భావాలను ప్రజల మెదడులోకి చొప్పిస్తున్నారని అన్నారు. మతం, దేవుళ్ళు, పూజలు అనేవి వ్యక్తిగతమైనవని అన్నారు. రాజకీయాలలో మతాన్ని చొప్పించి మెజార్టీ ప్రజల ఓట్లు కొల్లగొట్టేందుకు ఉన్మాదాన్ని, అల్లర్లనుసృష్టించటవే మతోన్మాదంఅన్నారు.ఈపరిస్థితులను ఆసరాచేసుకునిమతోన్మాదులు, కార్పొరేట్ శక్తులు కలిసి ప్రకృతి వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజా సంపద మొత్తాన్ని అప్పనంగా దోచుకుంటున్నారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, మరోవైపు వ్యవసాయ రంగాన్ని సంపూర్ణంగా సంక్షోభంలోకి నెడుతున్నారని అన్నారు. దానికి తోడు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్రకటించినవాణిజ్యయుద్ధంతోభారత వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు. అమెరికాలో నూటికి నాలుగు శాతం మాత్రమే వ్యవసాయ రంగంలో ఉన్నారని అన్నారు. మన దేశంలో 65 శాతం మంది పైగా ఉన్నారని అన్నారు. మన ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ చాలా నామమాత్రమని అన్నారు. మనదేశంలో ఎకరం రెండు ఎకరాలు ఉన్నవాళ్లు కూడా వ్యవసాయం చేస్తారని, అమెరికాలో ఒక్కో రైతు వెయ్యి ఎకరాలకు పైగా వ్యవసాయం చేస్తారని అన్నారు. అమెరికాలో వ్యవసాయదారునికి వంద రూపాయలు ఖర్చు పెడితే ప్రభుత్వం 40 రూపాయలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఇండియా లో అది కేవలం 3 ? మించి లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో అత్యధిక సబ్సిడీలు పొందిన అమెరికన్ కంపెనీల ద్వారా తయారవుతున్న వ్యవసాయఉత్పత్తులుభారతదేశంలోకి దిగుమతి అయితే భారత వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకికూరుకుపోతుందన్నారు. అటు రైతులతో పాటు వారి మీద ఆధారపడి పని చేసే కూలీలకు పనులు లేకుండా పోతాయని అన్నారు. అంతేకాక అమెరికా ఉత్పత్తులపై మనం ఆధారపడితే క్రమంగా వారి ఆధిపత్యం లోకి మన దేశం పోతుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్న ట్రంపు టారిఫ్ విధానాన్ని మోడీ ప్రభుత్వం వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఏ స్వార్ధ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ట్రంపు టారిఫ్ పట్ల మౌనం దాలుస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రంపు సుంకాల నుండి దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలని, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ప్రతిఘటించాలని అన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ట్రంప్ ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం ప్రత్తి దిగుమతులపై సుంకాలు తొలగించినందునవ్యవసాయదారులతోపాటు బట్టల పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతుందని, వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారని అన్నారు. మనదేశంలో ఉత్పత్తి అయ్యే రొయ్యలపై అమెరికాలో టాక్స్ లు పెంచినందున చాపలు, రొయ్యల చెరువులపై ఆధారపడుతున్న రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రష్యా నుండి మన దేశం ఆయిలు దిగమతులు చేసుకుంటున్నందుకు సుంకాలు వేస్తున్నానని ట్రంప్ మాట్లాడటం అభ్యంతరకరమని అన్నారు. ఎటువంటి పన్నులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులన్నీ ఇండియాకు దిగుమతి చేసేందుకు మోడీ ప్రభుత్వం ఒప్పుకున్నదని ట్రంపు ప్రకటించడం పట్ల మోడీ మౌనం దాల్చడం ఆందోళనకరమని అన్నారు. అమెరికా అధిపత్యానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిలబడాలని, అందుకు ప్రజలు మోడీ ప్రభుత్వంపై తేవాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కోట ఏవీకేఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు




కోట నవంబర్ 5 (శ్రీ చక్ర ): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన డిస్క్ త్రో అండర్ 17 పోటీల్లో కోట ఎవికెఆర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు పదవ తరగతి చదివే పాకం గౌతమ్ జిల్లా స్థాయిలో జరిగిన డిస్క్ త్రో పోటీల్లో విజయం సాధించగా,8వ తరగతి చదివే భవ్యశ్రీ 100 పరుగు పందెంలో మొదటి స్థానం,200మీటర్ల పందెంలో 3 వ స్థానం,80 మీటర్ల హుడ్లర్ లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని,అదే విధంగా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని ఆపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వల్లీ అహ్మద్ తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వాల్మీకేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి అత్యంత వైభవంగా అన్నాభిషేకం



సత్యవేదు,నవంబరు5(శ్రీచక్ర):శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లి కొండేశ్వర స్వామి దేవస్థానం నందు పౌర్ణమి సందర్భంగా శ్రీ వాల్మీకేశ్వర స్వామి వారిని మరియు శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని అన్నంతో అలంకరించడం జరిగినది .తదుపరి కొంచం అన్న ప్రసాదమును ఆలయ ప్రకారం నందు గంగలో కలుపుతూ పాడిపంటలు బాగా పండి ప్రజలకి అన్నం కొరత లేకుం డా అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ పూజలు నిర్వహించడం జరుగుతుంది.అనంతరం స్వామివారిని అలంకరించిన అన్న ప్రసాదంను భక్తులకు ఉచితంగా వినియోగించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డి.పద్మనాభ రాజు, కార్యనిర్వహణాధికారి పి.లత,ఆలయ పాలక మండలి సభ్యులు కే శ్రీనివాసులు నాయుడు,పీసీ హంస రుద్రయ్య, కవిత చంద్రశేఖర్, నెల్సన్ మండేలా, నాగభూషణమ్మ మస్తాన్, మరియు ఆలయ అర్చకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీనివాస సత్రం బీచ్ ను సందర్శించిన తహసిల్దార్



కోట నవంబర్ 5 (శ్రీ చక్ర): కోట మండలంలోని శ్రీనివాస సత్రం బీచ్ ను కోట తాహసిల్దార్ కటారి.జయ జయ రావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు,మెరైన్,సివిల్ పోలీసుల పర్యవేక్షణలో సోమవారం సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా బీచ్ పరిసర ప్రాంతాల్లో అనవసరమైన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మెరైన్, సివిల్ పోలీసులు, రెవిన్యూ అధికారులు తో జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ కటారి జయ జయ రావు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా అక్కడ ఉండే స్థితిగతులు ను మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వి ఆర్ ఓ శ్రీనివాసులు,మండల సర్వేయర్ గోపిరెడ్డి,పోలీసులు ఉన్నారు.

## ఘనంగా క్రికెట్ బ్యాట్స్మెన్ శ్రీ విరాట్ కోహ్లీ జన్మదిన వేడుకలు

కోట నవంబర్ 5 (శ్రీ చక్ర): భారతదేశ ప్రముఖ బ్యాట్స్ మెన్ శ్రీ విరాట్ కోహ్లీ 38 వ జన్మదిన సందర్భంగా ఎస్పీ మెడికల్ షాప్,ఫ్యాన్సీ విద్యానగర్ యజమాని,లైన్ మెన్ మల్లానీ రమేష్ ఆధ్వర్యంలో దేవా వారి బృందం కోహ్లీ జన్మదిన వేడుకలు రాజుపాలెం గూడలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్య కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. తదుపరి విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ ,యువత పాల్గొనడం జరిగింది.



## పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమావేశం

### నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథం



కర్నూలు, నవంబర్ 5 (శ్రీచక్ర)3 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అందరికీ అందుబాటులో ఉండే విధంగా అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్నూలు నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 258 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 60 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూపొందించిన ప్రతిపాదనలపై చర్చించామన్నారు. గత అనుభవాల ఆధారంగా ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఒక్కో పోలింగ్ బూత్‌లో 1,200 మంది ఓటర్ల వరకు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అధికారులు, బీఎల్వోలు సంయుక్తంగా 60 నూతన పోలింగ్ బూత్‌లు, 11 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పులు, 25 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పులు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారని, అందరి ఆమోదంతో ఈ మూడు అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు ఆర్వో తెలిపారు. అదే విధంగా ఓటర్లు 18 ఏళ్లు పూర్తయినవారు నూతన ఓటు కోసం ఫారం-6, చనిపోయిన ఓటర్ల తొలగింపు కోసం ఫారం-7, ఓటరు కార్డు సవరణ కోసం ఫారం-8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు నూతన బీఎల్ఏ (ఃఒం) జాబితాను పార్టీల వారీగా సమర్పించాలని కోరారు. ఓటరు వివరాల తనిఖీ కోసం వెబ్‌సైట్ https://ceoandhra.nic.in/ చేసుకోవచ్చు. ఫారం 6, 7, 8 కోసం స్థానిక బీఎల్వోను సంప్రదించాలి. ఈ కార్యక్రమంలోకర్నూలుఅర్బన్ తహసిల్దార్ రవి కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ధనుంజయ, సూపరింటెండెంట్సుబ్బన్న పాల్గొన్నారు.

## యువతలోని ప్రతిభను ప్రదర్శించడానికి చక్కని అవకాశం

### యువత ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

### దేశ అభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల, నవంబరు 05 :?యువతలోని ప్రతిభను వెలికితీయడానికి యువజనోత్సవాలు ఒక సువర్ణావకాశమని, యువత తాము నైపుణ్యం కలిగిన రంగాల్లో ప్రతిభను ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాల ఆడిటోరియంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా యువజనోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, సెట్కూరు సీఈఓ డా. కె. వేణుగోపాల్, కళాశాల చైర్మన్ జి. రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ప్రగతి, టిడిపి నాయకుడు ఎన్.ఎం.డి. ఫిరోజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువతలోని సృజనాత్మకత, ప్రతిభ, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం యువజనోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోందని తెలిపారు. వ్యాసరచన, వాక్చాతుర్యం, పెయింటింగ్, నృత్యం, గానం, జానపద కళలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. యువతకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని, ఇదే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని అన్నారు. విద్యార్థి దశలో ఎదురయ్యే గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం ద్వారా జీవితంలో విజయపథంలో ముందుకు సాగవచ్చన్నారు. జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయ ఆధారిత కుటుంబాల నుంచే ఉన్నందున, విద్యార్థులు తమ నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం నుండి కనీసం ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పమని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, వారిలో నేర్చుకునే తపనను పెంపొందించాలన్నారు.

# రికవరీ చేసిన 669 (విలువ రూ. 1 కోటి 20 లక్షలు) మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత

**జిల్లా పోలీసు కార్యాలయంలో " 3 వ మొబైల్ రికవరీ మేళా " కార్యక్రమం**

**అత్యధిక మొబైల్స్ రికవరీ చేసిన పోలీసులను అభినందించిన...జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

కర్నూలు, నవంబర్ 5 (శ్రీచక్ర): కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన 669 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బాధితులకు బుధవారం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పేరడ్ మైదానంలో "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్ల ను బాధిత ప్రజలకు అందజేశారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు 669 ( విలువ రూ. 1 కోటి 20 లక్షలు) మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. ప్రజలు ప్రయాణాలలో, రైల్వేస్టేషన్లు, జాతరలు, ఉత్సవాలలో ఇలా పలు చోట్ల మొబైల్స్ ను పొగోట్టుకుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహరాష్ట్ర, తెలంగాణ మరియు పలు జిల్లాల నుండి రికవరీ చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీసును, ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ అనేది మన జీవితంలో ఒక భాగంగా ఉందన్నారు. ప్రతి రోజూ ప్రతి పని లో మొబైల్ ఉపయోగం ఉంటుందన్నారు. మొబైల్ లో మనకు సంబంధించిన స్టడీ యాప్స్, చిన్న పిల్లల ఫోటోలు, ఆన్ లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు పర్సనల్ వివరాలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావా దేవిలు, అటాచ్ మెంట్స్, సెంటిమెంట్స్, ఇలా చాలా మిస్ అవుతూ ఉంటారన్నారు. ఈ సంవత్సరంలో మూడవ సారి మొబైల్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా మొబైల్ పోగోట్టుకుంటే వెంటనే కర్నూలు పోలీసు వెబ్ సైట్ కు http://kurnoolpolice.in/mobiletheft వెళ్ళి పొగోట్టుకున్న మొబైల్ ఎఓఇ వివరాలు తెలియజేస్తే సెల్ పోన్ రికవరీ చేసేందుకు కర్నూలు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈ పోలీసు సేవ కు ఏలాంటి రుసుము చెల్లించకుండా ఉచితం అని , మొబైల్ పోయిన తర్వాత బాధపడడం కంటే ఆ మొబైల్ ఫోన్ పోగోట్టుకోకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. 669 మొబైల్స్ లలో అత్యధికంగా రికవరి చేసిన కర్నూలు ఫోర్త్ టౌన్ పియస్- కర్నూలు డిఎస్పీ ఆఫీసు అటాచ్ మెంట్ లో పని చేస్తున్న శేఖర్ బాబు 96 మొబైల్స్, ఆదోని టు టౌన్ పియస్ కు చెందిన నాగరాజు 30 మొబైల్స్ , ఇస్వి పియస్ కు చెందిన రామచంద్ర 16 మొబైల్స్ రికవరీ చేయడంతో జిల్లా ఎస్పీ గారు









అభినందించి , ప్రశంసా పత్రాలు అందజేశారు. సెల్ ఫోన్ పొగోట్టుకున్న బాధితులు రికవరీ చేసి ఇచ్చినందుకు జిల్లా ఎస్పీకి, సైబర్ ల్యాబ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. 1) మాధవ రెడ్డి ? కర్నూలు, పెద్దమార్కెట్. నా మొబైల్ ను జనవరి 2024 లో కర్నూలు కొత్తబస్టాండు దగ్గర పొగోట్టుకున్నాను. నా ఫోన్ ను కర్నాటక రాష్ట్రం లో రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. 2) రామక్రిష్ణ ? కర్నూలు. నా మొబైల్ ను కర్నూలు, విశ్వభారతి హాస్పిటల్ లో పొగోట్టుకున్నాను. నంద్యాల జిల్లా, ఆత్మకూరు లో రికవరీ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. 3) శాంతకుమారి ? కర్నూలు . కర్నూలులో ఉన్న వావిలాల స్విమ్మింగ్ పూల్ దగ్గర మా అబ్బాయి మొబైల్ పొగోట్టుకున్నాడు. ఏప్రిల్ నెలలో మా అబ్బాయి చదువుకునే యాప్స్ అన్ని మొబైల్ లో ఉండేవి , చదువుకునే డేటా అంతా పరీక్షల సమయంలో పోవడంతో చాలా ఇబ్బందిగా ఉండేది. మొబైల్ కోడుమూరు లో దొరకడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. 4) హారిక ? కర్నూలు. కర్నూలు వెంకటరమణ కాలనీ దగ్గర నా మొబైల్ పోయింది. నా మొబైల్ ను మహరాష్ట్ర లో రికవరీ అయింది. నా మొబైల్ దొరకడం నాకు చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. 5) మహేష్ ? కర్నూలు, బి. తాండ్రపాడు. కర్నూలు, వెంకాయపల్లి దగ్గర మొబైల్ ను పొగోట్టుకున్నాను. నా మొబైల్ హైదరాబాద్ లో రికవరీ కావడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, సిఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, నాగరాజా రావు, శివశంకర్, సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పోలీసులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు

**రైతులు రెండు మూడు రకాల పంటలను సాగు చేయాలి**

**పాడి పశువుల పెంపకం తో రైతు బలపడాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, నవంబర్, 05 (శ్రీచక్ర): ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని,అందువల్ల రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రైతులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలంలోని పెద్ద టేకూరు, తడకనపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పంటల సాగు ను పరిశీలించి రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా జిల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పద్ధతుల్లో సాగు చేయడం వల్ల ఖర్చులు తగ్గి, నేల సారవంతం అవుతుందన్నారు. మితి మీరిన విధంగా పురుగు మందులు వాడడం వల్ల ఆరోగ్య పరంగా, పర్యావరణ పరంగా దుష్ప్రభావాలు ఉంటాయని, వాటి వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. నీరు [redacted]ట్టుబడి పంటలు







సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారుల వివరాల ప్రకారం, కల్లూరు మండలంలో 16,934 మంది రైతులు మొత్తం 42,033 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇందులో ప్రధానంగా పత్తి, ఉల్లి పంటలు అధికంగా సాగు చేసినట్లు తెలిపారు. పెద్ద టేకూరు గ్రామానికి చెందిన రైతు కోటయ్య శనగ పంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు కోటయ్య మాట్లాడుతూ, 2.5 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నాను. ఎకరానికి సుమారు రూ.15వేల నుండి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది.వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 6?8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది అని కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతు దస్తగిరి పొలాన్ని సందర్శించారు. ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట పరిస్థితులను పరిశీలించారు. ఒకే పంటపై ఆధారపడకుండా, రెండు మూడు రకాల పంటలను సాగు చేస్తే ఒక పంట రాకపోయినా, ఒక పంటకు ఆదాయం వస్తుందని రైతులకు సూచించారు.×తడకనపల్లె లో పశువుల హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్తదుపరి తడకనపల్లె గ్రామంలోని పశువుల హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ 40 గేదలు ఉన్నాయని, గ్రామంలో రోజుకు 500 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటితో రోజుకు సుమారు 100 కిలోల పాల కోవా తయారు చేస్తున్నారని అధికారులు వివరించారు. జిల్లాలో ఈ పశువుల హాస్టల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి రైతు వ్యవసాయం తో పాటు పాడి పశువుల ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మరింత మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ సహేరబి తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి సౌందర్యం కలిగిన పర్యాటక ప్రాంతం..విజయవనం (పుల్లయ్య పార్క్)

[redacted]





బెలూన్ పిక్ ఆటల్లో పాల్గొన్నారు..జిల్లా కలెక్టర్ షటిల్, క్యారమ్, మ్యూజికల్ చైర్స్ ఆటల్లో, జాయింట్ కలెక్టర్ టగ్ ఆఫ్ వార్, షటిల్, క్యారమ్ లో అధికారులతో కలిసి ఆడారు.. టగ్ ఆఫ్ వార్ , షటిల్ ఆటల్లో జాయింట్ కలెక్టర్ టీం గెలుపొందింది.. తొలుత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విజయవనం లో మొక్కలు నాటారు... అనంతరం ఉసిరి చెట్టు వద్ద పూజాదికాలు నిర్వహించారు. షటిల్ గేమ్ లో గెలుపొందిన జాయింట్ కలెక్టర్, మ్యూజికల్ చైర్స్ లో గెలుపొందిన సాంఘిక సంక్షేమ అధికారి రాధిక కి, బెలూన్ పిక్ గేమ్ లో గెలుపొందిన అనురాధ, అగ్నిమాపక శాఖ అధికారికి కలెక్టర్ తులసి బ్యాగ్ లను బహుమతులుగా ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ కన్సర్వేటర్ బి. వి.కృష్ణమూర్తి, డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అటవీ శాఖ అధికారిని శ్యామల, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి , తదితరులు పాల్గొన్నారు..

## మంత్రి నారా లోకేష్ ని కలిసిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి



విజయవాడ, నవంబర్ 5 (శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు వై.వి.బి రాజేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర కమిటీ నాయకులు మంగళవారం మంత్రి నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచు, ఎంపిటిసి , జడ్పీటీసీల సమస్యలు, నిధులు, విధులు మరియు అధికారాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. సర్పంచుల, ఎంపీటీసీల మరియు జడ్పిటిసిల గౌరవ వేతన బకాయిలను వెంటనే విడుదల చేయించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం బిర్రు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి స్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, త్వరలోనే సర్పంచు, ఎంపిటిసి , జడ్పీటీసీల సమస్యల పరిష్కారం మరియు స్థానిక సంస్థల బలోపేతం దిశగా అడుగులు పడతాయని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి తో పాటు ఉపాధ్యక్షుడు కొత్తపు ముని రెడ్డి (కడప జిల్లా), మరో ఉపాధ్యక్షులు గోగినేని వసుధ (గుంటూరు జిల్లా), చుక్క ధనుంజయ యాదవ్ (చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు), రాష్ట్ర కార్యదర్శి యలవర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


## డబ్బులకు టికెట్లు అమ్ముకునే సంస్కృతి తెలుగుదేశం పార్టీది కాదు, టీజీ కుటుంబానిది కాదు.. రాష్ట్ర మంత్రి టీజీ భరత్



విజయవాడ, నవంబర్ 5 (శ్రీచక్ర): డబ్బులకు టికెట్లు అమ్ముకునే సంస్కృతి తెలుగుదేశం పార్టీది కాదు, టీజీ కుటుంబానిది కాదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. విజయవాడ నుండి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేటర్ ఎన్నికల్లో పార్టీకి డిపాజిట్లు ఇస్తేనే టికెట్లు ఇస్తారన్న పుకార్లపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఎవ్వరూ నమ్మొద్దని ఆయన తెలిపారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల్లో నమ్మకం పొందిన వారికే టికెట్లు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే నాలుగైదు సార్లు సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పినట్లు తెలిపారు. కార్పొరేటర్ టికెట్ ఇచ్చే ముందు సర్వేలు చేయించి అందులో మొదటి స్థానంలో ఉన్న వారికే టికెట్ కేటాయింపు జరుగుతుందన్నారు. కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు అర్హత డబ్బు ఎంత మాత్రం కాదని, ప్రజల మనసు గెలిచిన వారికే టికెట్లు ఇస్తామని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదన్నారు. నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకు పనికట్టుకొని ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుంటారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు మాటలు నమ్మొద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి టీజీ భరత్ చెప్పారు. నాయకులందరూ ప్రజల సమస్యలు, వార్డులో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

## సచివాలయాన్ని తనిఖీ నిర్వహించిన డిప్యూటీ ఎంపీడీవో.

మార్కాపురం నవంబర్ 5 శ్రీ చక్రమార్కాపురం పెద్దారవీడు మం. బి.చర్లపల్లి గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో వి. శ్రీనివాస్ తనిఖీ చేశారు. శానిటేషన్, ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డుని, క్లాప్ మిత్ర జీతాలు, మైకుబండ్ల కి పెట్టి అవగాహన చెత్త విషయంలో జరుగుతున్నదా లేదా మరియు అటెండెన్స్ ముఖ్యంగా ప్రతి ఒక్క ఉద్యోగి ప్రతిరోజు ఒక టాస్క్ ఫిక్స్ చేసుకొని గౌ. కలెక్టర్ గౌ. డిపిఓ ఆదేశించిన ప్రకారం ఇంటి పన్ను వసూలు కార్యక్రమం చాలా ముఖ్యమైనది గా భావించి వెంటనే ప్రతిరోజు ప్రతి ఒక్కరు 20 ఇళ్లకు తగ్గకుండా పన్నులు వసూలు చేయాలని జీఎస్డబ్ల్యూఎస్ సిబ్బందిని యావత్తు పంచాయతీ అభివృద్ధి అధికారి అయిన డి డి ఓ వినియోగించుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు ఇంటి పన్నుపై తాను పంచాయతీ కార్యదర్శులు తో సాయంత్రం లేదా ఉదయం రివ్యూ చేస్తానని తెలియజేశారు. గ్రామపంచాయతీ సంబంధించి యావత్ రిజిస్టర్ల నిర్వహణ అడిగి తెలుసుకున్నారు. మరి ఒకసారి పూర్తిస్థాయి సమయం ప్రతి పంచాయతీకి కేటాయించి ముందుగా నోటీసు ద్వారా తెలిపి అందరి సిబ్బందితో కూడా వారి వారి విధులు చర్చించి రికార్డు, తనిఖీ చేస్తానని, సమాచార హక్కు చట్టం బోర్డు తప్పక సచివాలయం లో ఉండాలని ఆదేశించారు.



## సిఐటీయు ప్రకాశంజిల్లా మహాసభలను జయప్రదం చేయండి
## 8న జరుగు బహిరంగ సభ జయప్రదంచేయండి

మార్కాపురం నవంబర్ 5 శ్రీ చక్రమార్కాపురం సిఐటియు ప్రకాశం జిల్లా మహాసభలు నవంబర్ 8, 9 తేదీల్లో దర్శి లోజరుగుతున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ సమస్యలపై రాజీలేని పోరాటాలకు రథసారధిగా సిఐటియు రాష్ట్రంలో కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు. ప్రకాశం జిల్లా 13వ మహాసభలు ఈనెల 8,9 తేదీల్లో దర్శి పట్టణంలో జరుగుతున్నాయని అన్నారు ఈ సందర్భంగా 8 తేదీన ఉదయం 10 గంటలకు దర్శి పట్టణంలో మహా ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతుందని ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ ,సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుకేఉమామహేశ్వరరావు తదితరులుహాజరవుతున్నారని అన్నారు . కార్మిక ఉద్యోగలకు భద్రత కల్పించాలని, అంగన్వాడి, ఆశా, మిడ్ డే మీల్స్, వివో ఏ, ఆర్ పి తదితర స్కీమ్ వర్కర్లు,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయాలనిఆయనడిమాండ్ చేశారు. కనీస వేతనాలను అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా మహాసభలకు జిల్లా నలుమూల నుండిప్రతినిధులుహాజరవుతున్నారని మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి రానున్న కాలంలో సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు రూపకల్పన చేసేందుకు మహాసభలు వేదిక కానున్నాయని అన్నారు. గత ప్రభుత్వం అడుగుజాడలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం నడుస్తున్నదని, కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం తన విధానాలను అవలంబిస్తున్నదని అన్నారు. కార్మికుల పట్ల ప్రభుత్వం వైఖరి విడనాడాలని లేనిచో సిఐటియుపోరాటాలకుసిద్ధమ వుతుందని అన్నారు. సమస్యలపై జిల్లా మహాసభలలో చర్చించడం జరుగుతుందని అన్నారు. 8న జరుగు బహిరంగ సభకు మార్కాపురం పట్టణంలోని కార్మిక ఉద్యోగులు పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, పట్టణ కన్వీనర్ కి రూబెన్, కే రేణుక, ఎం లక్ష్మి, జి చెన్నకేశవులు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.




## వెలంపాలెంలో పిఎం ప్రవాస్ యోజన కార్యక్రమం





రామచంద్రపురం, నవంబర్ 5 (శ్రీచక్ర)రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆద్వర్యంలో పి ఎం ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి బిజెపి సీనియర్ నాయకులు అనకాపల్లి బిజెపి ఇంచార్జ్,రామచంద్రపురం మండల బిజెపి ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు ముఖ్య అతిథిగా, మండల బిజెపి ఆత్మ నిర్భర్ భారత్ కన్వీనర్ హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు,జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకటరావు విశిష్ట అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో మండల బిజెపి అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో మండల పదాదికారులను,శక్తి కేంద్రాల ప్రముఖులను,పోలింగ్ బూత్ కమిటీలను నియమించడం జరిగింది. అదేవిధంగా మండలంలో పలువురు ఇంచార్జి చిట్టిబాబు ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరడం జరిగింది. ఈ సమావేశంలో శక్తి ప్రముఖులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రధాని మోడీ పథకాలను ప్రతీ గ్రామంలోనూ,బూత్ స్థాయిలో తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా స్వదేశీ ప్రతిజ్ఞ చేసి ఇంటింటా స్వదేశీ ప్రతీ ఇంటా స్వదేశీ స్టిక్కర్స్ అంటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి,మండల ఓబీసీ నాయకులు ఇంధన సత్యనారాయణ,మండల బిజెపి ఉపాధ్యక్షురాల వేటూరి మహాలక్ష్మి, మహిళా నాయకురాలు పద్మావతి, ఆరెస్సెస్ నాయకులు నారాయణ, మండల బిజెపి కార్యవర్గ సభ్యులు చింతా సత్యనారాయణ,బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంజిత మృతి పై సమగ్ర దర్యాప్తు చేయాలి

### ప్రభుత్వాన్ని ప్రజాసంఘాలు డిమాండ్
### మృతురాలు కుటుంబానికి పరామర్శ
### ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి ప్రజాసంఘాలు





రామచంద్రపురం, నవంబర్ 5 (శ్రీచక్ర)భాష్యం స్కూల్ విద్యార్థిని రంజిత అనుమానాస్పద మృతి పై సమగ్ర దర్యాప్తు చేయాలని– పీ.డీ.ఎస్.యూ, ఏ.ఐ.కె.ఎమ్.ఎస్, ఐ.ఎఫ్. టీ.యూ ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం రామచంద్రపురంలో స్థానిక విలేఖరులతో మాట్లాడారు. రామచంద్రపురం భాష్యం స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థిని చిర్రా రంజిత (11) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై పీ.డీ.ఎస్.యూ, ఏ.ఐ.కె.ఎం.ఎస్, ఐ.ఎఫ్.టీ.యూ ప్రజా సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ ఘటనపై ప్రభుత్వం అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేయాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, ఏ.ఐ.కె.ఎం.ఎస్ నాయకులు వెంటపల్లి భీమశంకరం తదితరులు ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించారు. తల్లిదండ్రులు ఈ మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో, వారు ఉంటున్న అద్దె ఇంటి ఓనర్ కుమారుడిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆయనపై మాకు అనుమానం ఉందని తల్లిదండ్రులు అంటున్నారని అన్నారు. ఆయన పై కూడా దర్యాప్తు జరపాలని ప్రజా సంఘాలు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంజిత మృతి పై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని, ఉన్నతాధికారుల కమిటీతో విచారణ జరిపి, అద్దె ఇంటి వద్ద, భాష్యం స్కూల్‌లో కూడా అంతర్గత దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలు పెరిగాయని, విద్యార్థులు ఆత్మ హత్యలు అరికట్టాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ . యూ నాయకులు చింతా రాజారెడ్డి, పీ.డీ.ఎస్.యూ నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ను అభినందించిన బహుజన నాయకులు



కోట నవంబర్ 5 (శ్రీ చక్ర): మొంతా తుపాన్ తో అవార్డు పొందిన తహసీల్దార్ కటారి.జయ జయ రావు ను కోట తహసీల్దార్ కార్యాలయం లో బహుజన నాయకులు కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు మిజురు మాధవ్, ఇంగిలాల మదన్ మిత్రా,పాల మల్లి, పనబాక హేమంత్,కర్లపూడి వెంకటరమణయ్య,దాసరి అశోక్ కంబ్లె,పిండి కేశవ,నెలవాయి నాగేంద్ర,కుదురు కోటి,జోరెపల్లి తేజ తదితరులు పాల్గొన్నారు.

## హసన్ బాధలో స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర



రామచంద్రపురం , నవంబర్ 5( శ్రీచక్ర)రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిబి,ట్రాక్టర్ల సహాయంతో రోడ్ కు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు స్వయంగా ట్రాక్టర్ నడిపి చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించడంలో సహకరించారు. దీంతో ఇప్పటివరకు రోహదారు ఇరువైపులా ఉన్న చెత్త తరలించడంతో కాకినాడ– కోటిపల్లి ప్రధాన రహదారి తో పాటు గ్రామంలో పురవీధులు శుభ్రంగా దర్శినమిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## 8 న మోడరన్ ప్రైమరీ స్కూల్ లో కంటి వైద్య శిబిరం





రామచంద్రపురం, నవంబర్ 5 (శ్రీచక్ర)రామచంద్రపురం పట్టణం ముచ్చిమిల్లి రోడ్డులో గల ఎబిసి మోడరన్ స్కూల్ నందు ఈనెల 8న(శనివారం) మోడరన్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహణ లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వ హిస్తున్నట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయిన్ జి.వి.రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా కంటి వైద్యంలో విశిష్టమైన సేవలు అందిస్తూ 3,50,000 మందికి పైగా శస్త్ర చికిత్సలు నిర్వహించి మెరుగైన కంటి చూపు అందించిన కిరణ్ కంటి ఆసుపత్రి అందిస్తున్న సేవలను రామచంద్రపురం పట్టణముతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా ఉపయోగించుకోవాలని కోరారు. నవంబర్ 8న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్, పాత రిపోర్టులు, ఫోన్ నెంబరు తీసుకొని రావాలని తెలిపారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడు తున్న ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని జి.వి.రావు విజ్ఞప్తి చేశారు.

## కోవూరు నగర్ లో చైన్ స్నాచింగ్ షాక్!!

కోవూరు నగర్ లో చైన్ స్నాచింగ్ కలకలం!!దేవాలయానికి వెళ్తున్న మహిళపై దుండగుల దాడిమూడు తులాల బంగారు గొలుసు స్వాహా!!క్షణాల్లో దొంగల సాహసం, పోలీసులు గాలింపు ప్రారంభం!!బైక్‌పై వచ్చిన దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు!!కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన దొంగతనంకోవూరు నగర్‌లో మహిళపై దాడి,,చైన్ స్నాచింగ్ కేసు నమోదు!!సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు వేగవంతంపట్టణంలో చైన్ స్నాచింగ్‌లు పెరుగుతున్నాయి!!ప్రజలకు అప్రమత్తత సూచించిన పోలీసులుమాధవీలతకు చేదు అనుభవం, దేవాలయ మార్గంలో దొంగల దాడి!!దొంగల వేటలో పోలీసులు, ప్రత్యేక బృందాలు రంగంలోకి!!

## పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణ



జీలుగుమిల్లి నవంబర్ 04( శ్రీ చక్ర)మండలం లోని తాటియాకుల గూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహింపించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె .గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏ ఓ మాట్లాడుతూ రైతులు పంటల్లో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. అదే విధంగా త్వరలో మండలం లోని ములగలం పల్లి సొసైటీ,కామయ్య పాలెం డిసిఎంఎస్, జీలుగుమిల్లి సొసైటీ లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లు రోజా, ఉషా, ఎపి సి ఎన్ ఎస్ సిబ్బంది,పలువురు రైతులు పాల్గొన్నారు

# 7 కోట్లు.. 55 మీటర్లు..

### 100మందిని ఒకేసారి ఆపగలిగే దృఢత్వం

విశాఖపట్టణం, నవంబర్ 5, భవిష్యత్తులో ఏ ఇజమూ ఉండదు.. కేవలం టూరిజం మాత్రమే ఉంటుంది " అని ఏపీ సీయం చంద్రబాబు పదే పదే చెబుతుంటారు. దాని తగ్గట్టే ఆంధ్రప్రదేశ్లో టూరిజం ప్రాజెక్టులు చాలానే పట్టాలు ఎక్కాయి. కొన్ని ప్రభుత్వమే చేపడుతుంటే మరికొన్ని పీపీపీ మోడల్ లో తయారవుతున్నాయి. అయితే మాటల్లో చెప్పినంత వేగంగా ఇవి రియాల్టీ లోకి రావడం లేదు. చాలా విషయాల్లో కమ్యూనికేషన్ గ్యాప్ బలంగానే ఉంది. అలాంటి వాటికి ఉదాహరణ వైజాగ్ లోని కైలాసగిరి గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్. నెలల క్రితమే తయారైన ఈ బ్రిడ్జ్ ఇప్పటికీ ఓపెన్ కాకపోవడం వైజాగ్ వాసుల్లో అసహనాన్ని రేకెత్తిస్తోందిభారతదేశంలోనే ఇంకెక్కడా లేని అతి పెద్ద కేంటి లివర్ గ్లాస్ బ్రిడ్జ్ విశాఖలో రెడీ అయిందనే వార్త ఒక్క వైజాగ్ వాసులకే కాక రెండు తెలుగు రాష్ట్రాల్లోని టూరిస్టులకు చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. కైలాసగిరి కొండ అంచు పై నుండి గ్లాస్ బ్రిడ్జిపై నడుస్తూ పర్వతం,లోయ, అడవి,సముద్రం ఇలా విభిన్నమైన ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే అవకాశం ఈ గ్లాస్ బ్రిడ్జ్ ఇస్తుందని అందరూ ఉప్పొంగి పోయారు. మొదట్లో ఆగస్టు 15 టైమ్ కి రెడీ అవుతుందని భావించినా పనులు ఆలస్యం వల్ల సెప్టెంబర్ లో ప్రారంభిస్తామన్నారు.వైజాగ్ గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ ఇంకెప్పుడు ? నిర్మాణం పూర్తయినా ఎదురుచూపులు ఎందుకు? సెప్టెంబర్ 25 కి బ్రిడ్జి ఓపెన్ అవుతుందని వార్తలు కూడా వచ్చాయి. తర్వాత అక్టోబర్ వచ్చింది, దసరా, దీపావళి కూడా వెళ్లిపోయాయి. నవంబర్ నెల కూడా వచ్చేసింది. అయినప్పటికీ ఈ స్కైవాక్ గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ ఎప్పుడు అనేది తెలియక వైజాగ్ వాసులు అయోమయంలో పడ్డారు. టూరిజం పరంగా ఎంతో పొటెన్షియల్ ఉన్న వైజాగ్ లో ఈ గ్లాస్ బ్రిడ్జ్ పెద్ద అట్రాక్షన్ అవుతుందని అందరూ భావిస్తున్నారు. ఏడు కోట్లు ఖర్చుపెట్టి 55 మీటర్ల పొడవున ఈ గ్లాస్ బ్రిడ్జ్ ని నిర్మించారు. కేరళ లో ఇలాంటి బ్రిడ్జ్ ఇంకొకటి ఉంది కానీ దాని పొడవు 38 మీటర్లే. ఇదే ఏడాది మిజోరామ్ లో కూడా ఐజ్వాల్ స్కై వాక్ పేరుతో ఒక గ్లాస్ బ్రిడ్జ్ ఓపెన్ చేశారు కానీ దాని పొడవు 10 మీటర్లే. ఎలా చూసినా విశాఖపట్నం లోని స్కై వాక్ బ్రిడ్జ్ దేశం లోనే చాలా పెద్దది. 250ఎఏ వేగం తో వీచే గాలులను సైతం తట్టుకునేలా దీన్ని నిర్మించినట్టు చెబుతున్నారు. ఎఓఖీఆం ఈ నిర్మాణన్ని సూపర్ వైజ్ చేస్తుండగా కేరళకు చెందిన ఖీఏ అడ్వవెంచర్స్ సంస్థ నిర్మాణం చేసింది. ఇది ఒకేసారి 100 మంది బరువును తట్టుకుంటుంది అని నిర్వాహకులు చెబుతున్నారు.ఎఓఖీఆం ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ ఈ స్కై వాక్ బ్రిడ్జ్ పై ప్రత్యేక దృష్టి పెట్టారు.. చాలాసార్లు వెళ్లి నిర్మాణాన్ని పర్యవేక్షించి వచ్చారు. ఆయన ఈ స్కైవాక్ బ్రిడ్జిని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఓపెన్ చేయించాలని ప్రయత్నిస్తున్నారని సమాచారం. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత లోకేష్ రెండుసార్లు వైజాగ్ వెళ్లి వచ్చారు. అయినప్పటికీ స్కై వాక్ బ్రిడ్జ్ ఓపెన్ కాలేదు. లోకేష్ టైం దొరక్కే గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ లేట్ అవుతుందని వీఎంఆర్డిఏ వర్గాలు చెబుతున్నాయి వైజాగ్ గ్లాస్ బ్రిడ్జ్ ఓపెనింగ్ ఇంకెప్పుడు ? నిర్మాణం పూర్తయినా ఎదురుచూపులు ఎందుకు? ఈ నెలలో ( నవంబర్ 14-15 తేదీల్లో ) వైజాగ్ లో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు జరగబోతుంది. పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా దీన్ని నిర్వహిస్తోంది. దేశ విదేశాల్లోని పారిశ్రామిక వ్యాపార అతిథులను ఆహ్వానించడం కోసం సీఎం చంద్రబాబు లోకేష్ విదేశీ పర్యటనలు సైతం చేసి వచ్చారు. వైజాగ్ లోని టూరిజం అట్రాక్షన్లు అన్నింటికీ క్రొత్త అందాలు దిద్దుతున్నారు. మరి ఆ సందర్భంగానన్నా వైజాగ్ స్కై వాక్ బ్రిడ్జ్ ని అందుబాటులోకి తీసుకొస్తారో లేదో చూడాలని సగటు విశాఖ వాసి కోరుతున్నాడు.

# బాలిక ఆత్మహత్య పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు





రామచంద్రపురం లో కలకలం రేపిన బాలిక ఆత్మహత్య...భాష్యం స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని.ఆత్మహత్య లేక హత్య అనే కోణల్లో విచారణ.రామచంద్రపురం,నవంబర్ 5 (శ్రీచక్ర)రామచంద్రపురం పట్టణంలోభాష్యం స్కూల్ నందు ఐదవ తరగతి చదువు తున్న సిర్రా రంజిత ( 11) ఇంట్లో ఎవరు లేని సమయంలో సున్నీ తో ప్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.మంగళవారం ఉదయం స్కూల్ కి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన రంజిత ఆత్మహత్య కు పాల్పడిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.బాలిక ను ఎవరైనా హత్య చేసి ఆత్మ హత్యగా చిత్రీకరించేందుకు చున్నీ బాలిక మెడకు వేసి ప్యాన్ కు వ్రేలాడుదీశారా? అనే సందేహాలు వ్యక్త మౌతున్నాయి.బాలిక ఆత్మ హత్యకు పాల్పడిన గృహానికి పోలీసులు చేరుకుని గదిని క్షుణ్ణంగా పరిశీలించారు.బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి కి తరలించి రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .బాలిక ఆత్మహత్యకు పాల్పడిందా ?లేక ఎవరైనా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేసారా? అనే పేరు కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు ఆత్మ హత్య కు పాల్పడిన బాలిక తల్లి సునీత స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్ గా పని చేస్తుండగా, తండ్రి రాజు ముంబై లో మెరైన్ ఇంజనీర్ గా పనిచేస్తున్నారు.వీరి పెద్ద కుమార్తె వేరే ప్రాంతం లో నవోదయ స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతుంది.తల్లి, ఆత్మ హత్యకు పాల్పడిన బాలిక మాత్రమే ఇక్కడ రామచంద్రపురంలో అద్దె గృహంలో ఉంటున్నారు.బాలిక తల్లి కాకినాడలో తన బంధువుల వద్దకు వెళ్ళిన నేపథ్యంలో బాలిక రంజిత స్కూల్ నుంచి ఆటోలో ఇంటికి తిరిగి వచ్చిన వెంటనే తల్లికి ఫోన్ చేసినట్లు సమాచారం.తల్లి సునీత ఇంటికి చేరుకునే లోపు బాలిక ఈ అఘాత్యానికి పాల్పడిందని ఆవేదన.ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఎవరైనా ఏమైనా చేసి హత్య చేశారా? లేక ఆత్మ హత్య కు పాల్పడిందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.వీరు ఉంటున్న అద్దె గృహ యజమాని కుమారుడు నేర చరిత్ర కలిగిన వ్యక్తి కావడంతో అతనితోపాటు వీరి ఇంటికి తరచూ వచ్చే వ్యక్తులపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.అదేవిధంగా బాలిక చదువుకున్న బాష్యం స్కూల్ రాక పోకలలో ఎవరైనా ఈ బాలికను వెంబడిస్తున్నారా?అనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.ఏదిఏమైనా పూర్తి సమాచారం పోలీసులు దర్యాప్తులో తేలాల్సి వుంది.

# జగన్నాటకాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

**అవినీతి చేసి కులం కార్డు వాడుతారా**

**పార్థివ దేహాలపై చిల్లర ఏరుకునే రకం..**

**జోగి రమేష్ మీడియా సమావేశంలో మంత్రి సుభాష్**

రామచంద్రపురం, నవంబర్ 5 (శ్రీచక్ర)జగన్ ఆడే జగన్నాటకాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వైసిపి నాయకుల వంకర బుద్ధి మారాలని దేవుని కోరుకుంటా నని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన రామచంద్రపురంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్టంలో తుఫాన్ విలయ తాండవం చేసి అన్నదాతలు పుట్టెడు కష్టంలో ఉన్న రైతుల పరామర్శల పేరుతో జగన్ జె జే లు కొట్టించుకుంటూ బల ప్రదర్శన చేస్తున్నారని విమర్శించారు. ఒకప్పుడు జే బ్రాండ్(జగన్) కు తోడు. జే ఆర్( జోగి రమేష్) బ్రాండ్ తోడైందని ఎద్దేవా చేశారు. ప్రజల ప్రాణాలతో ఆటలాడుకునే నకిలీ మద్యం తయారుచేసి ప్రభుత్వ షాపుల్లోనే విక్రయాలు జరిపారని అన్నారు. సిట్ అధికారులు పక్కా ఆధారాలతో జోగి రమేష్ ను అరెస్టు చేశారని అన్నారు. మరోపక్క జగన్ తన వికృత శేష్టలతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు.సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో చంద్రబాబు-లోకేష్ లు శ్రమిస్తుంటే, ఆరోపణలు చేసే పనిలో జగన్ నిమగ్నం అయ్యారని దుయ్యబట్టారు.నిజాయితీ పాలనకు ప్రజలు అండగా ఉన్నారని అబద్దాలతో రాజకీయాలు చేసే జగన్ కాలం ముగిసిందని వివరించారు.రాష్ట్రానికి మంచి చేయడానికంటే అబద్ధాల ప్రచారమే ముఖ్యమని భావించే జగన్ రెడ్డి, ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడేంత నైతిక స్థాయి లేదన్నారు. పాలన అంటే ఏమిటో కూడా తెలియని జగన్, నాలుగేళ్ల లోపే రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల కష్టాలు పెరిగినా, యువతకు ఉద్యోగాలు రాకపోయినా, ప్రభుత్వ ఉద్యోగులకు హక్కులు దక్కకపోయినా జగన్ మాత్రం నాటకాలు, అబద్ధాలు, ప్రచారాలు మాత్రమే చేశాడన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచిందా జగన్ పార్టీ? ఒక్క వాటర్ ప్యాకెట్ కూడా పంపించలేదని ఇదేనా ప్రజల పక్షాన నిలవడం అంటే అని ప్రశ్నించారు. జగన్ హయాంలో తొమ్మిది తుఫాన్లలు వచ్చి రైతులు కష్టాలు పడిన తగు సహాయం రోజు చేయలేకపోయారని అన్నారు. జగన్ అండ చూసుకొని సహాయం రోజుమాజీ మంత్రి జోగు రమేష్ మట్టి, కరోనా టైం లో అక్రమ మందుల అమ్మకాలు, అగ్రిగోల్డ్ భూముల కబ్జాలు, తాజాగా కల్తీ మద్యం కేసులో పూర్తి ఆధారాలతో, జోగిరెడ్డి అతని సోదరుడు రాము ను అధికారులు అరెస్ట్ చేశారన్నారు. ఈ కేసులో ఎ1 ముద్దాయి వాంగ్మూలంలో పూర్తి వివరాలు వెల్లడించారన్నారు. అవినీతి చేసి బీసీ కార్డు కులం వాడుకోవడం చేతగానితనమని విమర్శించారు. అవినీతి చేయడంలో మీకు మీరే సాటి మీకు ఎవరూ లేరు పోటీ అని మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇకనైనా డ్రామాలకు తరలించకపోతే జగన్ అండ్ కో వారికి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పాపం... శ్యామలేనా.. మిగిలింది

విజయవాడ, నవంబర్ 5, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేసిన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు పార్టీకి దూరమయ్యారు. 2024 ఎన్నికల్లో ఓటమి ఎదురైన తరువాత సినీ నటుడు అలీ తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తేల్చేశారు. ఎన్నికలకు ముందే వైసిపి తో తనకు సంబంధం లేదన్నట్టు స్వచ్ఛందంగా తప్పుకున్నారు మంచు మోహన్ బాబు. అయితే నటుడు, రచయిత పోసాని కృష్ణ మురళి మాత్రం కాస్త యాక్టివ్గానే ఉండేవారు. వైసీపీలో క్రియాశీలకంగా పని చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ వైసీపీ హయాంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కు సంబంధించి కేసు మెడకు చుట్టుకుంది. చాలా రోజులు పాటు పోసాని జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ ప్రభావం ఆయన ఆరోగ్యం పై కూడా చూపింది. దీంతో వైసీపీలో క్రియాశీలకంగా ఉండడాన్ని తగ్గించేశారు పోసాని. అయితే ఇప్పుడు సినీ పరిశ్రమ నుంచి ఉన్నది కేవలం మాజీ మంత్రి రోజా మాత్రమే. అయితే తాజాగా ఆమెకు సినీ యాంకర్ శ్యామల తోడైంది. ప్రస్తుతం ఆమె సైతం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.మొన్న ఆ మధ్యన కర్నూలు బస్సు ఘటన జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫేక్ ప్రచారానికి దిగింది. హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఓ ద్విచక్ర వాహనదారుడు ఇందుకు కారణం అని తేలింది. అయితే సదరు యువకుడు బెల్ట్ షాపులో నకిలీ మద్యం తాగడం వల్లే ఆ ఘటనకు కారణమయ్యాడని యాంకర్ శ్యామల ఆరోపించారు. అయితే సదరు యువకుడు మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసిన సీసీ ఫుటేజీ బయటకు వచ్చింది. కేవలం ప్రభుత్వం పై విమర్శలు చేసేందుకే శ్యామల ఆతరహా ఆరోపణలు చేసినట్టు తేలింది. దీంతో కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్ననే పోలీస్ స్టేషన్కు వెళ్లారు శ్యామల. వెంట కర్నూలు వైసీపీ నేతలు ఉన్నారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఆ పార్టీకి క్రమేపి దూరమయ్యారు. కమెడియన్ అలీ లాంటి వ్యక్తులు సినీ పరిశ్రమలో ఇబ్బంది పడినట్టు వార్తలు వచ్చాయి. కానీ ఆయన కంటూ ప్రత్యేక గుర్తింపు సినీ పరిశ్రమలో ఉండడంతో నిలదొక్కుకున్నారు. మోహన్ బాబు సైతం ఏ పార్టీతో కలవకుండా తన పని తాను చేసుకుంటున్నారు. పోసాని కృష్ణ మురళి సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధపడ్డారు. కానీ యాంకర్ శ్యామల మాత్రం తిరిగి బుల్లితెరపై కనిపించడమే మానేశారు. అయితే ఆమె రాజకీయాలు చేసిన తర్వాత వృత్తిపరంగా పెద్దగా అవకాశాలు లేకుండా పోయాయి. అందుకే నెలకు 3 లక్షల రూపాయల వేతనంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా మారిపోయారు అన్న వార్తలు వచ్చాయి. కానీ బుల్లితెరపై యాంకరింగ్ అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె వైయస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో దూసుకుపోతోంది.



అమరావతి రాజధాని నిర్మాణం చేపడుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. మరోవైపు విశాఖకు భారీ ఐటి సంస్థలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం పరిశ్రమలను ఏర్పాటు చేస్తోంది. అయితే ఏ చిన్న లోపం వెలుగు చూసినా దానిని హైలెట్ చేస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ప్రజా పోరాటాలకు దూరంగా.. ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారానికి దగ్గరగా ఉంటుంది ఆ పార్టీ. అయితే ఇప్పుడు అంతా సోషల్ మీడియా యుగం. ప్రజలకు ఇట్టే నిజాలు తెలిసిపోతున్నాయి. ఇటువంటి సమయంలో స్ట్రాటజీలు మార్చాలి. కానీ వైసీపీ పాత చింతకాయ వాసన మాదిరిగా.. అదే ధోరణితో ముందుకు సాగుతోంది. అయితే ఇప్పుడు అరెస్టులు అంటూ గగ్గోలు పెడుతోంది. ఒకసారి అరెస్టుల తీరు చూస్తుంటే ఇట్టే అర్థం అవుతుంది. ధర్మాన ప్రసాదరావు జోలికి వెళ్లారా? బొత్స సత్యనారాయణ పై కేసులు నమోదు చేశారా? ఒకసారి కేసుల నమోదు.. అరెస్టులు జరుగుతున్న నేతల ట్రాక్ రికార్డును చూస్తే ఇట్టే అర్థమయిపోతుంది.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అయ్యారు. కల్తీ మద్యం కేసులో ఆయనను అరెస్టు చేశారు. వాస్తవానికి జోగి రమేష్ పై నమోదు చేసేందుకు చాలా కేసులు ఉన్నాయి. అరెస్టు చేసేందుకు అవసరమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రం తో పాటు నవ్యాంధ్రప్రదేశ్లో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు చంద్రబాబు. సీనియర్ మోస్ట్ లీడర్ కూడా.ఇంటిపై దాడికి ప్రయత్నించారు జోగి రమేష్. అప్పట్లో అది సంచలనమే. టిడిపి శ్రేణులు రక్తం మరిగింది. అధికార మదంతో నాడు జోగి రమేష్ ఆ ప్రయత్నం చేశారు. దానికి ఏం చేయాలి? అధికారంలోకి వచ్చిన వెంటనే జోగి రమేష్ ను అరెస్టు చేయాలి. ఆ ఛాన్స్ వచ్చింది కూడా.. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. అయితే ప్రభుత్వం ఇదే ఉదాసీనతతో ఉంటుందని భావించిన జోగి రమేష్.. కల్తీ మద్యంతో చెడ్డ పేరు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అలా ప్రయత్నం చేసే క్రమంలో ప్రధాన నిందితుడే తమను జోగి రమేష్ ప్రోత్సహించాడని బయట పెట్టేశారు. అంటే ఇప్పుడు అరెస్టు జరిగింది కొత్త కేసులో మాత్రమే. పాత కేసులను తిరగ దోడలేదు. కేవలం కొత్త కేసులో మాత్రమే జోగి రమేష్ ను అరెస్టు చేశారు.గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో కూడా అలానే జరిగింది. ఆయన దూకుడు తనం తెలియంది కాదు. పద్ధతి లేకుండా మాట్లాడేవారు. చంద్రబాబు వయసు లెక్క చేయకుండా నూటికి ఎంత వస్తే అంత మాట అనేవారు. సాక్షాత్ అసెంబ్లీలోనే చంద్రబాబు సతీమణి గురించి నీచంగా మాట్లాడారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే వల్లభనేని వంశీ మోహన్ జోలికి పోలేదు ప్రభుత్వం. కానీ తన పాత తప్పులు ఎక్కడ బయట పడతాయో.. అని కొత్త తప్పులు చేశారు వల్లభనేని వంశీ మోహన్. ఏకంగా టిడిపి కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తిని బెదిరించారు. ఏరి కోరి కష్టాలను తెచ్చుకున్నారు. అలా ప్రభుత్వాన్ని కెలికి ఇబ్బందులు తెచ్చుకున్నారు. అంటే ప్రభుత్వం వారి జోలికి వెళ్లలేదు. ప్రభుత్వం జోలికి వారు వచ్చారన్నమాట. వైసీపీ హయాంలో సీనియర్ మంత్రులుగా ఉన్న చాలామంది ఇప్పుడు సేఫ్ జోన్ లో ఉన్నారు. ఎందుకంటే వారు రాజకీయాల్లో తమ కోసం తాము పని చేశారు. కానీ దూకుడు కలిగిన నేతల మనస్తత్వాన్ని గ్రహించారు జగన్. తన రాజకీయం కోసం వారిని పావులుగా వాడుకున్నారు. అయితే ఇప్పుడు వారే మూల్యం చెల్లించుకుంటున్నారు.




# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. నెంబర్ వన్ ర్యాంకుల్లో అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి..!

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీమిండియా యువ బ్యాటర్స్ అభిషేక్ శర్మ నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దాంతో నెంబర్ వన్ బ్యాటర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ మూడోస్థానంలో ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రెండోస్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్, నాలుగో స్థానంలో నిస్సంక (శ్రీలంక), నాలుగో స్థానంలో జోస్ బట్లర్ (ఇంగ్లండ్), ఆరోస్థానంలో ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఏడోస్థానంలో టిమ్ సీఫెర్ట్ (న్యూజిలాండ్), తొమ్మిద స్థానంలో కుషాల్ పెరీరా (శ్రీలంక), పదో స్థానంలో మిచేల్ మార్ష్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో విజయం తర్వాత పాక్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్ మెరుగయ్యాయి. కెప్టెన్ బాబార్ ఆజం తొమ్మిదిస్థానాలు మెరుగుపరుచుకొని 30వ స్థానానికి చేరుకున్నాడు. సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘా పదిస్థానాలు ఎగబాకి 39, 54 స్థానాలకు చేరారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 12వ స్థానానికి, బంగ్లాదేశ్‌కు చెందిన టాంజిద్ హసన్ 17వ స్థానానికి, ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ వరుసగా 15, 20వ స్థానాల్లో ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని 10వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ముజీబ్ ఉర్ రెహమాన్, మహేది హసన్ 14, 17వ స్థానానికి చేరుకున్నారు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హోల్డర్, రోస్టన్ చేజ్ 23, 38వ స్థానానికి చేరుకున్నారు.పాక్‌తో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ 15 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. టీమిండియా మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికందర్ రజా, వెస్టిండిస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టీ20ల్లో రజా 33 బంతుల్లో చేసిన సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హర్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, అక్సర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. అభిషేక్ శర్మ 16వ స్థానంలో ఉన్నాడు.



# బంగ్లాదేశ్ క్రికెట్‌లో వివాదం.. జూనియర్లపై కెప్టెన్ దాడి చేస్తుందని ఆరోపించిన జహానారా..!

బంగ్లాదేశ్ మహిళా క్రికెట్‌లో పెను వివాదం చెలరేగింది. కెప్టెన్ నిగర్ సుల్తానా జూనియర్ ఆటగాళ్లను దుర్భాషలాడుతూ, దాడి చేస్తుందని ప్రముఖ ఫాస్ట్ బౌలర్ జహానారా ఆలం సంచలన ఆరోపణలు చేసింది. పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశంతో కూడినవంటూ బంగ్లా క్రికెట్ బోర్డు ఆరోపణలను కొట్టిపడేసింది. బంగ్లాదేశ్ వార్తాపత్రిక కలేర్ కాంతోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జహానారా ఆలం అనేక పలు కీలక వ్యాఖ్యలు చేసింది. నిగర్‌కు ఇదేం కొత్త కాదని. జూనియర్ ఆటగాళ్లను వేధించడంతో పాటు చెంపదెబ్బలు కొడుతుందని మండిపడింది.ప్రపంచకప్ సమయంలోనూ, దుబాయి పర్యటనలోనూ కెప్టెన్ నిగర్ జూనియర్‌ను గదిలోకి పిలిచి చెంపదెబ్బ కొట్టిందని ఆరోపించింది. జట్టు వాతావరణం క్రమంగా విషపూరితంగా మారుతోందని జహానారా ఆలం పేర్కొంది. 2024లో యూఏఈలో జరిగిన టీ20 ప్రపంచ కప్ సమయంలో తాను తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నానని, దాంతో రెండు నెలల విరామం తీసుకున్నానని చెప్పుకొచ్చింది. బంగ్లాదేశ్ జట్టులో దాదాపు ప్రతీ ప్లేయర్ ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నారని.. ఒకరు లేదా ఇద్దరు ఆటగాళ్లు ఎక్కువ సౌకర్యాలు పొందుతారని.. మిగిలిన వారిని విస్మరిస్తున్నట్లుగా తెలిపింది. సీనియర్స్‌ను తొలగించే ప్రక్రియ 2021లో ప్రారంభమైందని.. తనను క్రమంగా జట్టు నుంచి తప్పించారని జహరానా ఆరోపించింది.అయితే, ఆరోపణలను బంగ్లా క్రికెట్ బోర్డు తోసిపుచ్చింది. ఆరోపణలన్నీ నిరాధారమని, దురుద్దేశంతో చేసినవేనని పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో జట్టు రాణిస్తున్న సమయంలో ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు నిరాశపరిచాయని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్ క్రికెట్ ఇకపై ఎలాంటి సంబంధం లేని ఓ క్రీడాకారిణి ఇలాంటి తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. అయితే, వివాదంపై కెప్టెన్ నిగర్ సుల్తానా స్పందించలేదు. ఈ ఆరోపణలు డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం, మహిళా క్రికెట్ ఇమేజ్ గురించి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జట్టు నాయకత్వం, ప్లేయర్స్, సహాయక సిబ్బందిపై పూర్తి విశ్వాసం ఉందని.. ఎలాంటి దర్యాప్తు అవసరం లేదని బీసీబీ చెప్పుకొచ్చింది.



# భారత్‌ను ఎగతాళి చేసిన హారిస్ రౌఫ్‌పై నిషేధం!

యుద్ధ విమానాలను కూల్చామని భారత్ అభిమానులను ఎగతాళి చేసిన పాకిస్థాన్ పేసర్ హారిస్ రౌఫ్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. ఈ ఘటనను తీవ్ర నేరంగా పరిగణించిన ఐసీసీ.. మ్యాచ్ ఫీజులో కోత విధించడంతో పాటు రెండు మ్యాచ్‌లు ఆడకుండా నిషేధం విధించింది.ఆసియా కప్ 2025 టోర్నీ సందర్భంగా సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్‌లో హారిస్ రౌఫ్ భారత అభిమానులను రెచ్చగొట్టాడు. బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేసే సమయంలో ఆరు యుద్ధ విమానాలను కూల్చామని సైగలు చేశాడు. సెప్టెంబర్ 28న జరిగిన ఫైనల్లోనూ రౌఫ్ మరోసారి ఇలాంటి ప్రవర్తనను పునరావృతం చేశాడు. దాంతో ఈ రెండు మ్యాచ్‌ల మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించిన ఐసీసీ.. రెండేసి చొప్పున మొత్తం నాలుగు డీ మెరిట్ పాయింట్లు కేటాయించింది. ఐసీసీ రూల్స్ ప్రకారం ఓ ఆటగాడు 24 నెలల వ్యవధిలో నాలుగు డీమెరిట్ పాయింట్స్ పొందితే రెండు మ్యాచ్‌లు ఆడకుండా నిషేధానికి గురవుతాడు. దీంతో రౌఫ్.. సౌతాఫ్రికాతో తొలి రెండు వన్డేలకు దూరమయ్యాడు.మరోవైపు తమ విజయాన్ని భారత సాయుధ బలగాలకు అంకితం చేసిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై కూడా ఐసీసీ చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించడంతో పాటు రెండు డీమెరిట్ పాయింట్స్ కేటాయించింది. మరో 24 నెలల వ్యవధిలో సూర్య ఖాతాలో మరో రెండు డీమెరిట్ పాయింట్స్ చేరితే అతను కూడా రెండు మ్యాచ్‌ల నిషేధం ఎదుర్కొవాల్సి ఉంటుంది.హాఫ్ సెంచరీ అనంతరం తుపాకీ ఎక్కిపెట్టినట్లుగా సంబరాలు చేసుకున్న పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్‌తో పాటు హారిస్ రౌఫ్‌ను క్లీన్ బౌల్డ్ చేసి విమానం కూలిందా? అంటూ సైగలు చేసిన బుమ్రాపై కూడా ఐసీసీ చర్యలు తీసుకుంది. ఈ ఇద్దరికి చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఆసియా కప్ 2025 టోర్నీలో టీమిండియా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే పీసీబీ ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఏసీసీ ఛైర్మన్‌గా టైటిల్ ప్రదానం చేసేందుకు సిద్ధం కాగా.. భారత్ నిరాకరించింది. మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా టైటిల్ స్వీకరించలేమని మొండికేసింది. దాంతో మోహ్సిన్ నఖ్వీ టైటిల్‌ను తన వెంట తీసుకెళ్లాడు. ఇప్పటి వరకు టైటిల్ తిరిగివ్వలేదు. పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా భారత్.. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే.







# స్మృతి మందానాకు ఆమె బాయ్‌ఫ్రెండ్ ఏం గిఫ్ట్ ఇచ్చాడో తెలుసా?

ముంబై: 2025 వన్డే వరల్డ్‌కప్‌లో లేడీ క్రికెటర్ స్మృతి మందానా కొత్త రికార్డు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఆ టోర్నీలో అత్యధిక రన్స్ చేసిన భారతీయ మహిళా బ్యాటర్‌గా నిలిచిందామె. 9 మ్యాచుల్లో ఆమె 434 రన్స్ చేసింది. మ్యూజిక్ కంపోజర్ పలాస్ ముచ్చల్‌తో స్మృతి మందానా డేటింగ్ చేస్తున్నది. త్వరలో ఆ ఇద్దరూ పెళ్లి చేసుకోనున్నట్లు తెలుస్తోంది. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆ ట్రోఫీతో కలిసి ఇద్దరూ ఫోటోలు దిగారు.నిజానికి స్మృతి, పలాస్ ఆరంభంలో తమ రిలేషన్ దాచిపెట్టారు. తమ కెరీర్‌లపై దృష్టి పెట్టి సక్సెస్ సాధించారు. కుటుంబ సభ్యులు, కొందరు ఫ్రెండ్స్‌కు మాత్రమే ఆ ఇద్దరి మధ్య ఉన్న రొమాన్స్ తెలుసు. 2024లో పబ్లిక్‌గా ఆ రిలేషన్‌ను కన్ఫర్మ్ చేశారు. మందానా, ముచ్చల్ ఫ్యామిలీలు ఆ జంటకు సపోర్టు ఇస్తున్నారు.ఫ్యామిలీకి చెందిన ప్రైవేటు ఫంక్షన్‌లో స్మృతికి పలాస్ ప్రపోజ్ చేసినట్లు తెలిసింది. ఆమెకు ఓ రొమాంటిక్ సాంగ్ కూడా డెడికేట్ చేశాడు. ఎంగేజ్మెంట్ కూడా రహస్యంగా జరిగింది. మహారాష్ట్రలోని స్మృతి స్వగ్రామం సాంగ్లీలో పెళ్లి చేసుకునేందుకు ఆ జంట రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. క్రికెట్, మ్యూజిక్ ఇండస్ట్రీ ప్రముఖులను ఆ మ్యారేజ్‌కు ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది.వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత స్మృతికి ఓ స్వీట్ గిఫ్ట్ ఇచ్చాడు పలాస్. తన చేయిపై ఎస్ఎం18 టట్టూ వేసుకున్నాడు మ్యూజిక్ కంపోజర్. ఎస్ఎం అంటే స్మృతి మందానా.. ఇక 18 ఆమె జెర్సీ నెంబర్ అని తెలుస్తోంది.




# బర్త్‌డే స్పెషల్.. కోహ్లి ఫిట్‌నెస్ సీక్రెట్ తెలుసా..?



టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్, పరుగుల రారాజు విరాట్ కోహ్లీ పుట్టిన రోజు నేడు. అండర్ -19 వరల్డ్ కప్ హీరోగా జట్టులోకి వచ్చి.. విలువైన ఆటగాడిగా.. సమర్ధుడైన నాయకుడిగా జట్టుపై తన ముద్ర వేసిన కోహ్లీ నేడు 37వ వసంతంలో అడుగుపెట్టాడు ఈ సందర్భంగా కోహ్లీకి సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సహచర ఆటగాళ్లు, సీనియర్ క్రికెటర్లు, అభిమానులు ఈ క్రికెట్ కింగ్‌కు విషెస్ తెలుపుతున్నారు. ఈ సందర్భంగా కోహ్లీ ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటో తెలుసుకుందాం..కోహ్లీ ఫిట్‌నెస్‌కి అధిక ప్రాధాన్యం ఇస్తాడన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రపంచంలోని ఫిట్టెస్ట్ క్రికెటర్ అని అడిగితే.. కోహ్లీ అని ఎవరైనా ఠక్కున చెప్పేస్తారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నిరంతరం కష్టపడుతూ తన శరీరాన్ని దృఢంగా ఉంచుకుంటాడు. ఆటతో పాటు ఫిట్‌నెస్‌తో విరాట్ కోట్లాది మంది అభిమానుల మనసు గెలిచాడు. ఫిట్‌నెస్‌లో భారత క్రికెట్ జట్టు సభ్యులందరూ విరాట్‌ను స్ఫూర్తిగా తీసుకుంటారు. వ్యాయామం, డైట్‌కు అంతలా ప్రాధాన్యమిస్తాడు ఈ స్టార్ బ్యాట్స్‌మెన్.ఫిట్‌గా ఉండేందుకు కోహ్లీ మూడింటికే అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఫిట్‌నెస్, ఆహారం విషయంలో క్రమశిక్షణతో ఉంటారు. రోజూ ఉదయం లేవగానే కార్డియో వర్కవుట్స్, క్రికెట్ ప్రాక్టీస్ చేస్తారు. ఇక ఆహారం విషయానికి వస్తే.. జంక్ ఫుడ్ అస్సలు తినరు. కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉంటారు. ఇక కోహ్లీ నిద్రకు కూడా తగిన ప్రాధాన్యత ఇస్తారు. నిద్ర విషయంలో అస్సలు రాజీపడరు. దాదాపు ఎనిమిది గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోతారు. మంచి నిద్రతో తగిన విశ్రాంతి దొరుకుతుందని కోహ్లీ భావిస్తారు. కోహ్లీ ఫిట్‌నెస్ వెనుక ఉన్న ఈ రహస్యాన్ని ఆయన సతీమణి, స్టార్ నటి అనుష్క శర్మ ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టారు.

# ఎందుకు పక్కన పెట్టామో.. అర్ష్‌దీప్ సింగ్‌కు అర్థమైంది: టీమిండియా బౌలింగ్ కోచ్

ఆస్ట్రేలియాతో తొలి రెండు టీ20లకు అర్ష్‌దీప్ సింగ్‌ను ఎందుకు పక్కనపెట్టామో అతనికి అర్థమైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2026 కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తున్నామని, ఈ క్రమంలోనే అతనికి అవకాశం దక్కలేదని వివరణ ఇచ్చాడు.ఈ విషయాన్ని అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని చెప్పాడు. మూడో టీ20లో రీఎంట్రీ ఇచ్చిన అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్‌ను పక్కనపెట్టడంపై క్లారిటీ ఇచ్చాడు.'అర్ష్‌దీప్ సింగ్ చాలా అనుభవం కలిగిన బౌలర్. మా ప్రయోగాల గురించిఅతను పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అతను ఒక ప్రపంచ స్థాయి బౌలర్. పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు తీసే బౌలర్. జట్టుకు అతని విలువ ఏంటో మాకు తెలుసు. అయితే ఈ పర్యటనలో మేం వివిధ కాంబినేషన్లను ప్రయత్నించాం.జట్టు ఎంపిక టీమ్‌మేనేజ్‌మెంట్‌తో పాటు ఆటగాళ్లకు సవాలే. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట విభిన్నమైన కాంబినేషన్స్‌ను ప్రయత్నించాలనుకుంటున్నాం. దీంతో ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరాశకు గురవ్వడం సహజమే. కానీ, మేనేజ్‌మెంట్ మరోలా ఆలోచిస్తుంది. ఆటగాళ్లను ఇంకా శ్రమించేలా ప్రోత్సహిస్తాం. ఎప్పుడూ అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేలా సన్నద్ధం చేస్తాం.వచ్చే పొట్టి కప్‌లోగా చాలా తక్కువ మ్యాచ్‌లనే ఆడాల్సి ఉంటుంది. ఒత్తిడి సమయాల్లో ఆటగాళ్లు ఎలా రాణిస్తారనేది పరీక్షించాం. వారి సత్తాపై మాకు ఎలాంటి సందేహం లేదు. మ్యాచ్‌లను ఎలా గెలవాలనే దానిపైనే వర్కౌట్ చేస్తున్నాం.'అని మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. నితీష్ కుమార్ రెడ్డి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, నాలుగో టీ20లో బరిలోకి దిగుతాడని మోర్కెల్ తెలిపాడు.



# తాగితే మెదడుకు జరిగేది ఇదే!: న్యూరో సైంటిస్టుల సంచలన నిజాలు!



మీరు అప్పుడప్పుడు గ్లాస్ వైన్ లేదా వారాంతంలో స్నేహితులతో కలిసి డ్రింక్ ఎంజాయ్ చేస్తారా? కొన్ని అధ్యయనాల ప్రకారం.. 84 శాతం కంటే ఎక్కువ మంది పెద్దలు తమ జీవితంలో ఏదో ఒక సమయంలో ఆల్కహాల్ తీసుకుంటారు. మితంగా తాగడం హానికరం కాదని అనిపించినప్పటికీ.. ఆల్కహాల్ మెదడుపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా తరచుగా లేదా అధికంగా తీసుకుంటే ఈ ప్రభావాలు మరింత తీవ్రమవుతాయి. వైద్యులు అందించిన వివరాల ప్రకారం.. ఆల్కహాల్ మీ మొత్తం నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది.పడిపోయిన బంగారం ధరలు.. తులం ఎంతో తెలుసా..?ఆల్కహాల్ మెదడు, నాడీ వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తుంది?ఆల్కహాల్ మెదడు, వెన్నుపాము, పరిధీయ నరాలతో సహా మొత్తం నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. తక్కువ మోతాదులో ఆల్కహాల్ తీసుకుంటే మెదడు కార్యకలాపాలను నెమ్మదిస్తుంది, దీనివల్ల విశ్రాంతి లేదా కొద్దిపాటి మగత కలుగుతుంది. ఎక్కువ/తరచుగా తీసుకుంటే.. ఆల్కహాల్ నరాల కణాలను దెబ్బతీస్తుంది, వాటి మధ్య సంభాషణను అడ్డుకుంటుంది. "కాలక్రమేణా, ఇది జ్ఞాపకశక్తి, సమన్వయం, మాఆల్కహాల్ సంబంధిత మెదడు సమస్యలు న్యూరాలజిస్టులు ఆల్కహాల్ సంబంధిత మెదడు సమస్యలను తీవ్రమైన, దీర్ఘకాలిక పరిస్థితులుగా వర్గీకరిస్తారు. ఇవి సాధారణంగా అధికంగా తాగినప్పుడు లేదా వెంటనే తర్వాత సంభవిస్తాయి. వెర్నికేస్ ఎన్సెఫలోపతి అనే వ్యాధి తీవ్రమైన విటమిన్ ః1 (థయామిన్) లోపం వల్ల వస్తుంది. ఇది గందరగోళం, సరైన సమన్వయం లేకపోవడం, కంటి కదలికలలో అసాధారణతలకు దారితీస్తుంది.కోర్సకోఫ్ సైకోసిస్: వెర్నికేస్ ఎన్సెఫలోపతికి చికిత్స చేయకపోతే, ఇది శాశ్వత స్థితికి చేరుకొని, జ్ఞాపకశక్తి కోల్పోవడం, గందరగోళం, వ్యక్తిత్వ మార్పులను కలిగిస్తుంది. ఇతర సమస్యలు కూడా ఉంటాయి. ఆల్కహాల్-ప్రేరిత మూర్ఛలు, ఉపసంహరణ సమయంలో తీవ్రమైన గందరగోళం, భ్రమలు కలిగించే డెలిరియం ట్రెమెన్స్ వంటివి సంభవించవచ్చు.దీర్ఘకాలిక నష్టం నిరంతరంగా ఆల్కహాల్ సేవించడం వల్ల ఈ సమస్యలు వస్తాయి. ఆల్కహాలిక్ న్యూరోపతి: ఇది పరిధీయ నరాలను దెబ్బతీస్తుంది. దీని కారణంగా చేతులు, పాదాలలో మంటతో కూడిన నొప్పి, తిమ్మిరి, బలహీనత కలుగుతాయి. నడవడం, సమతుల్యం పాటించడం కష్టమవుతుంది.ఆల్కహాలిక్ మయోపతి: కండరాల ఫైబర్లను దెబ్బతీసి, కండరాల బలహీనత, క్రమంగా శక్తి కోల్పోవడానికి దారితీస్తుంది.సెరెబెల్లార్ డిజెనరేషన్: సమన్వయం, సమతుల్యతను దెబ్బతీస్తుంది. తరచుగా వణుకు, పడిపోవడానికి దారితీస్తుంది.ఇతర ప్రమాదాలు: దీర్ఘకాలిక ఆల్కహాల్ వినియోగం స్ట్రోక్ (పక్షవాతం), డిమెన్షియా (మతిమరుపు) ప్రమాదాన్ని పెంచుతుంది.మార్చియాఫావా-బిగ్నామి వ్యాధి: ఇది మెదడు కణజాలం సన్నబడటానికి, క్షీణించడానికి దారితీసే అరుదైన, కానీ తీవ్రమైన రుగ్మత.భారత్‌పై ఓవర్ యాక్షన్ చేశావ్.. ఇప్పుడు చూడు ఎంత పనైందో ..!మితంగా తాగడం కూడా ఎందుకు సురక్షితం కాదు?మెదడుకు ఆల్కహాల్ సురక్షితం కాదని వైద్యులు తేల్చి చెప్పారు. మితంగా ఆల్కహాల్ తీసుకున్నా కూడా నిద్ర, ఏకాగ్రత, నిర్ణయం తీసుకునే సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తుంది. కాలక్రమేణా ఈ ప్రభావాలు పేరుకుపోయి, అభిజ్ఞా క్షీణత, నాడీ సంబంధిత రుగ్మతలకు దోహదం చేస్తాయి. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆల్కహాల్ తీసుకోవడం తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం, విటమిన్లు (ముఖ్యంగా ః1) సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవడం.. గందరగోళం, అసమతుల్యత లేదా తిమ్మిరి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం. న్యూరాలజిస్టుల ప్రకారం.. ఆల్కహాల్ తాత్కాలిక విశ్రాంతిని ఇచ్చినప్పటికీ, మెదడు పనితీరుకు, మానసిక స్పష్టతకు అయ్యే దీర్ఘకాలిక నష్టం చాలా ఎక్కువ. నియంత్రణ లేదా పూర్తిగా మానేయడమే ఆరోగ్యకరమైన మార్గం.

# కార్తీకమాసం స్పెషల్.. 'చలిమిడి'.. ఈ టిప్స్ పాటిస్తే వెన్నలా కరిగిపోతుంది..!

కార్తీకమాసంలో అనేకమంది నిత్యం పూజలు చేస్తుంటారు. శివనామస్మరణతో ఆలయాలు మారుమోగుతుంటాయి. నెల రోజులపాటు భక్తి శ్రద్ధలతో శివున్ని పూజిస్తారు. వివిధ రకాల నైవేద్యాలు తయారు చేసి నివేదన చేస్తుంటారు. అయితే ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకునే ప్రసాదం చలిమిడి. ఈజీగా ఈ ప్రసాదాన్ని తయారు చేసుకోవచ్చు. చిన్నపిల్లలు కూడా ఈ ఆహారాన్ని ఇష్టంగా తింటారు. మరి చలిమిడిని ఎలా తయారు చేసుకోవాలి..?ముందుగా చలిమిడి తయారు చేసుకోవడానికి తీసుకోవాల్సిన పదార్థాలు చూస్తే.. బియ్యం పిండి రెండు గ్లాసులు, బెల్లం తురుము ఒక అర కప్పు, జీడిపప్పులు కొన్ని రుచికి సరిపడా, యాలకుల పొడి అర టీ స్పూన్, నెయ్యి మూడు స్పూన్లు, పచ్చి కొబ్బరి ముక్కలు అరకప్పు తీసుకోవాలి.ఇక చలిమిడి ప్రసాదం తయారీ విధానం చూస్తే.. ముందుగా బియ్యం పిండిని తీసుకుని పక్కన పెట్టుకోవాలి. అయితే కొందరు తడి బియ్యంతో చేస్తారు. అలా కూడా చేసుకోవచ్చు. బియ్యాన్ని ముందు రోజు రాత్రి నానబెట్టుకోవాలి. దాదాపు ఆరు గంటలపాటు నానబెడితే బెటర్. ఆ తర్వాత బియ్యాన్ని వడకట్టి.. కొద్దిసేపు ఆరబెట్టి గ్రైండర్ లో వేసి గ్రైండ్ చేసుకోవాలి. లేదంటే డైరెక్ట్ బియ్యంపిండిని కూడా తీసుకోవచ్చు. ఇక బెల్లం పాకం కోసం ముందుగా స్టవ్ ఆన్ చేసుకుని నెయ్యి వేయాలి. నెయ్యి వేడెక్కాక పచ్చి కొబ్బరి ముక్కలు, జీడిపప్పు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత అవి పక్కన పెట్టుకోవాలి.ఇప్పుడు మళ్లీ స్టవ్ వెలిగించుకుని గిన్నె పెట్టి దాంట్లో బెల్లం తురుము వేయాలి. బెల్లం మునిగేవరకూ నీళ్లు పోయాలి. చిన్న మంట మీద ఉంచితే పాకం వస్తుంది. అందులో యాలకుల పొడిని, కొబ్బరి ముక్కలను, జీడిపప్పు వేసి కలుపుకోవాలి. అందులోనే బియ్యం పిండిని బెల్లంపాకంలో మెల్లగా వేస్తూ గరిటతో తిప్పుతూ ఉండాలి. అలా ఆపకుండా గరిటతో తిప్పుతూనే ఉండాలి. చలిమిడి గట్టిగా అయ్యే వరకూ తిప్పుతూ ఉండాలి. చివరిలో రెండు స్పూన్ ల నెయ్యి వేసి కలిపేసి దింపాలి. ఇక చలిమిడి రెడీ అయినట్లే



# నెలరోజులు ఇది రోజూ హాఫ్ స్పూన్ చాలు.. మీ ఆరోగ్యం ఎలా మారుతుందంటే!

మనం ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పసుపు చాలా ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే ఆహారం. అయితే అటువంటి పసుపును ఒక నెలరోజుల పాటు తీసుకోవడం వల్ల శరీరంలో ఎటువంటి మార్పులు చోటు చేసుకుంటాయి? ఎటువంటి ఆరోగ్య ప్రయోజనాలను పొందడం మనం చూడొచ్చు అనేది ప్రస్తుతం తెలుసుకుందాం.పసుపు చాలా మంచి ఆహారం. పసుపులో కర్కుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలతో కూడుకున్న క్రియాశీల సమ్మేళనం. అటువంటి పసుపును ఒక నెలరోజుల పాటు ప్రతిరోజు తీసుకుంటే మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుంది. ప్రతిరోజు తమ రోజువారి ఆహారంలో పసుపును చేర్చుకున్న వారు 30 రోజుల తర్వాత బలమైన వ్యాధినిరోధకశక్తితో కనిపించారు అని ఒక అధ్యయనం తేల్చింది.పసుపు నెలరోజులు తీసుకుంటే ఈ బెనిఫిట్స్ మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని



పెంచడానికి సహజ సప్లిమెంట్ గా పసుపు పనిచేస్తుంది. పసుపును ఒక నెలరోజుల పాటు ఆహారంలో భాగంగా చేసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది ప్రతిరోజు ఉదయం వేడి నీళ్లలో అర స్పూన్ వేసుకుని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు జీవక్రియ కూడా పెరుగుతుంది. పసుపులో ఉండే కర్కుమిన్ మన కడుపులో మంట వంటి లక్షణాలను తగ్గించి జీర్ణశక్తికి దోహదం చేస్తుంది.ఈ సమస్యలకు పసుపు బెస్ట్ రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారు ప్రతిరోజు ఉదయం పసుపును తీసుకుంటే కొంత ఉపశమనం లభిస్తుంది. పసుపు శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడంతో దీనిని తీసుకోవడం వల్ల శరీర ఆక్సీకరణ ఒత్తిడి నుండి కాపాడబడుతుంది. ఇక రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో పసుపు కీలక భూమిక పోషిస్తుంది.అంతేకాదు పసుపు మన చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తుంది.ఆరునెలల పాటు బెండకాయ నీళ్ళు తాగితే ఏమవుతుంది పసుపు విషయంలో ఇలా చెయ్యొద్దు.. జాగ్రత్త పసుపును ఎక్కువగా తీసుకుంటే ప్రతికూల ప్రభావాలు వచ్చే ప్రమాదం ఉంటుంది కాబట్టి పరిమిత మోతాదులో పసుపును తీసుకుంటే మంచిది. పిత్తాశయంలో రాళ్ళు ఉన్నవారు, కాలేయ సమస్యలు ఉన్నవారు పసుపును తీసుకోకుండా ఉంటేనే మంచిది. ఒకవేళ అనారోగ్య సమస్యలతో ఉన్నవారు పసుపుని తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలనుకుంటే ఒకసారి వైద్యుడిని సంప్రదించి, వైద్యుల సలహాలు, సూచనల మేరకు తీసుకుంటే మంచిది.

# ఈ వర్షాలకు వేడివేడి "బెండకాయ సాంబార్" ట్రై చేస్తారా..!



బెండకాయ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కూరగాయ. దీనిని ఇంగ్లీషులో ఓక్రా లేదా లేడీస్ ఫింగర్ (అని అంటారు. ముఖ్యంగా భారతీయ వంటకాల్లో కూడా బెండకాయని ఎక్కువగా ఉపయోగిస్తారు. అందులో ఉండే పోషక విలువలు అధికంగా ఉండడం.. సులభంగా జీర్ణమయ్యే గుణం కారణంగా దీనిని తరచుగా ఆహారంలో చేర్చుతారు. అయితే బెండకాయ అంటే చాలామందికి ఇష్టముండదు. అయితే బెండకాయ బంకగా ఉంటుందని.. రుచి ఉండదని ఎక్కువ మంది తినడానికి ఆసక్తి చూపరు. కానీ కొందరు మాత్రం బెండకాయ వేపుడు మాత్రమే తింటుంటారు. ఈ తరహా విషయాలు అన్నింటికీ చెక్ పెడుతూ పిల్లలకి అయిన పెద్దలకు అయినా కానీ ఇష్టంగా బెండకాయ తినిపించేందుకు బెస్ట్ ప్లాన్ ఇదే. ఎలాంటి సీజన్ లో అయినా కానీ మంచిగా తినేలా.. మరి ముఖ్యంగా ఈ వర్షాలకు వేడివేడిగా బెండకాయ సాంబార్‌ను ఒకసారి ప్రయత్నించండి. దీన్ని రుచి చూసినవారు లొట్టలేసుకుంటూ తినడం మాత్రం పక్కా అని చెబుతున్నారు. బెండకాయ సాంబార్ ఎలా తయారు చేయాలో మీకోసం ప్రత్యేకంగా.. కావాల్సిన పదార్థాలు.. కందిపప్పు - 1 కప్పు (180 గ్రాములు) నూనె - 4 టేబుల్?స్పూన్లు బెండకాయలు - పావుకిలో ఉల్లిపాయ - 1 పచ్చిమిర్చి - 3 పసుపు - పావు చెంచా టమాటా - 1 చింతపండు - 50 గ్రాములు కారం - రుచికి తగినంత ధనియాల పొడి - 1 టీస్పూన్ ఉప్పు - రుచికి సరిపడా సాంబార్ పొడి - 1 టేబుల్?స్పూన్ బెల్లం తురుము - 1 టేబుల్?స్పూన్ కరివేపాకు - కొద్దిగా కొత్తిమీర తరుగు - కొద్దిగా సాంబార్ తాలింపు కోసం.." నూనె - 1 టేబుల్?స్పూన్ ఆవాలు - 1 టీస్పూన్ మినప్పప్పు - 1 టీస్పూన్ శనగపప్పు - 1 టీస్పూన్ ఎండుమిర్చి - 2 కరివేపాకు - 2 రెమ్మలు జీలకర్ర - 1 టీస్పూన్ ఇంగువ - కొద్దిగా తయారీ విధానం.. ముందుగా కందిపప్పును శుభ్రంగా కడిగి ఒక గంట నానబెట్టాలి. అలానే ఒక చిన్న గిన్నెలో చింతపండును కూడా నానబెట్టుకోవాలి. ( ఈ లోపు బెండకాయలను శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి )' 1 ఉల్లిపాయను సన్నని చీలికలుగా, టమాటాను పెద్ద క్యూబ్‌లుగా కట్ చేసి సిద్ధం చేసుకోవాలి. ప్రెషర్ కుక్కర్ లో నానబెట్టిన కందిపప్పు, మూడున్నర కప్పుల నీళ్లు పోసి మీడియం మంట మీద మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. కుక్కర్ ప్రెషర్ పూర్తిగా తగ్గాక మూత తీసి, ఉడికిన పప్పును గరిటెతో మెత్తగా మాష్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసుకోవాలి. నూనె వేడెక్కాక కోసి పెట్టుకున్న బెండకాయ ముక్కలు వేసి హై ఫ్లేమ్‌లో కాసేపు వేయించాలి. బెండకాయ ముక్కలలోని జిగురు పోయి, కాస్త నల్లబడే వరకు వేయించి, ఒక ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మరొక పాన్ పెట్టి రెండు టేబుల్ స్పూన్ల నూనె వేయాలి. నూనె వేడయ్యాక సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి చీలికలు వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఆ తర్వాత పసుపు వేసి మరోసారి వేపుకోవాలి. ఇప్పుడు టమాటా ముక్కలు వేసి అవి మగ్గే వరకు ఉడికించాలి. టమాటాలు మగ్గిన తర్వాత వేయించి పెట్టుకున్న బెండకాయ ముక్కలు వేసి కలిపి, మూత పెట్టి మరో రెండు నిమిషాలు మగ్గనివ్వాలి. ఆ తర్వాత నానబెట్టిన చింతపండు నుంచి తీసిన 250 మి.లీ. రసం వేసి కలిపి, మూత పెట్టి నాలుగు నిమిషాలు ఉడికించాలి. ఉడికిన తర్వాత మూత తీసి కారం, ధనియాల పొడి, ఉప్పు వేసి కలిపి మరో నిమిషం పాటు ఉడకనివ్వాలి. ఆ తర్వాత మాష్ చేసి పెట్టుకున్న కందిపప్పు, 150 మి.లీ. నీళ్లు కలిపి బాగా కలిపి, మూత పెట్టి హై-ఫ్లేమ్‌లో బాగా మరగనివ్వాలి. పప్పు బాగా ఉడుకు పట్టిన తర్వాత సాంబార్ పొడి వేసి కలిపి మరికాసేపు మరిగించుకోవాలి. చివరగా బెల్లం తురుము, కరివేపాకు వేసి కలిపి, మంటను సిమ్‌లో ఉంచి సాంబార్‌ను అలా మరుగుతుండనివ్వాలి. ఇప్పుడు తాలింపు కోసం స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేసుకోవాలి. నూనె వేడెక్కాక ఆవాలు వేసి చిటపటమనిపించాలి. ఆ తర్వాత శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, జీలకర్ర, కరివేపాకు, ఇంగువ వేసి చక్కగా వేయించుకోవాలి. వేగిన తాలింపును మరో బర్నర్ మీద మరుగుతున్న సాంబార్‌లో వేసి బాగా కలిపి, నిమిషా లు మరగనివ్వాలి. చివరగా కొత్తిమీర తరుగు వేసి కలిపి దించేసుకుంటే ఘుమఘుమలాడే బెండకాయ సాంబార్ రెడీ

# ఖాళీ కడుపుతో టీ స్పూన్ నెయ్యిని కలిపి ఈ రసాన్ని తీసుకోండి- మొత్తం సాఫ్

ఆయుర్వేదం ప్రకారం.. ఖాళీ కడుపుతో ఒక టీస్పూన్ నెయ్యి, తులసి రసం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.వాతం, పిత్తం, కఫ దోషాలను తొలగిస్తుంది. వాటిని సమతౌల్యంగా ఉంచుతుంది. ఈ తులసి, నెయ్యి మిశ్రమాలు శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపిస్తాయి. శ్వాసకోశ, చర్మ సమస్యలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. రోజువారీ జీవనశైలిలో నెయ్యి, తులసి రసం డిటాక్స్ థెరపీగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఓ టీ స్పూన్ నెయ్యి, తులసి రసం మిశ్రమాన్ని రోజువారీ దినచర్యలో చేర్చుకోవడం వల్ల ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో తెలుసుకుందాం. స్వచ్ఛమైన ఆవు నెయ్యి ఓజస్ లేదా ప్రాణశక్తికి మూలం. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. మెదడుకు పోషణనిస్తుంది. చర్మ సంబంధిత ఇబ్బందులను నయం చేస్తుంది. కీళ్ల నొప్పులను కూడా తగ్గించే సామర్థ్యం దీనికి ఉంది. ఆయుర్వేదం ప్రకారం.. నెయ్యి "సత్వ" గుణం కలది. అంటే ఇది మనస్సును ప్రశాంతంగా, నిలకడగా ఉంచడం సహాయపడుతుంది. దీనికి తులసిని చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. తులసిని ఆయుర్వేదంలో ఎంత ప్రాధాన్యత ఉందో మనకు తెలిసు. ఇది వాతం, పిత్తం, కఫం సంబంధిత ఇబ్బందులను నయం చేస్తుంది. తులసిలో ఉండే సహజసిద్ధమైన యాంటీఆక్సిడెంట్, యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు.. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. తులసి రసం శరీరాన్ని డీటాక్సిఫై చేస్తే, నెయ్యి శరీరానికి పోషణనిస్తుంది. ఈ కలయిక శరీరాన్ని లోపలి నుండి శుద్ధి చేస్తుంది. శక్తిని, రోగనిరోధక శక్తిని, మానసిక స్థిరత్వాన్ని పెంచుతుంది. ఒత్తిడి, అలసట, తరచుగా జలుబు, అజీర్తితో బాధపడేవారికి ఇది ఎంతో ప్రయోజనకరం. ఇది శ్వాసకోశ వ్యవస్థకు ప్రయోజనకరమైనది. తులసి రసం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. నెయ్యి చర్మాన్ని పోషిస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మ కాంతి పెరుగుతుంది. జుట్టు బలపడుతుంది. శరీరానికి సహజమైన మెరుపును అందిస్తుంది.








# మెగా మూవీ భీమ్స్ బాధ్యత పెద్దదే..!

మాస్ మహరాజ్ రవితేజ హీరోగా భాను భోగవరపు డైరెక్షన్ లో వచ్చిన సినిమా మాస్ జాతర. మాస్ రాజా ఫ్యాన్స్ ఓకే కానీ కామన్ ఆడియన్స్ మాత్రం రవితేజ రెగ్యులర్ మాస్ సినిమాలానే ఉందని అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ కొంత ఇంపాక్ట్ చూపించాడు కానీ రిజల్ట్ మాత్రం అతన్ని ఖుషి చేయలేదు. ఐతే మెగాస్టార్ చిరంజీవి తో అనిల్ రావిపూడి చేస్తున్న సినిమా మన శంకర వరప్రసాద్ కి భీమ్స్ మ్యూజిక్ ఇస్తున్నాడు. చిరంజీవి సినిమా ఛాన్స్ అంటే అది మామూలు విషయం.. భీమ్స్ కి వచ్చిన అతి పెద్ద ఛాన్స్ ఇది. ఎందుకంటే చిరంజీవి సినిమా ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు. అందులోనూ భీమ్స్ చిరంజీవికి వీరాభిమాని అని తెలిసిందే. అందుకే తనకు వచ్చిన ఈ ఛాన్స్ ని అన్నివిధాలుగా వాడుకోవాలని చూస్తున్నాడు భీమ్స్ . అనిల్ రావిపూడితో సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు పనిచేశాడు కాబట్టి చిరు సినిమాకు అతనే కావాలని చిరంజీవిని పట్టుబట్టి మరీ ఒప్పించాడు అనిల్ రావిపూడి. ఐతే ఈ సినిమా మ్యూజిక్ విషయంలో



భీమ్స్ చాలా జాగ్రత్త వహిస్తున్నట్టు తెలుస్తుంది. చిరంజీవి సినిమా పాట హిట్టైతే ఆ రీచ్ వేరేలా ఉంటుంది. అంతేకాదు ఆయన గ్రేస్ కి తగినట్టుగా మ్యూజిక్ ఇవ్వాల్సి ఉంటుంది. ఐతే భీమ్స్ సిసిరోలియో ఈ బాధ్యత అంతా తన మీద వేసుకుని మెగాస్టార్ కి అదిరిపోయే ఆల్బం ఇస్తున్నాడని తెలుస్తుంది. ఆల్రెడీ టీజర్ తో వింటేజ్ చిరు మ్యూజిక్ వాడిన భీమ్స్ నెక్స్ట్ మీసాల పిల్లతో అదరగొట్టేశాడు.‶ భీమ్స్ తన డ్యూటీ పర్ఫెక్ట్ గా.. సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు ఎలా అయితే గోదారి గట్టు మీద సాంగ్ పుష్ ఇచ్చిందో ఇప్పుడు మన శంకర వరప్రసాద్ సినిమాకు మీసాల పిల్ల సాంగ్ క్రేజ్ తెచ్చింది. ఈ సాంగ్ తోనే భీమ్స్ తన డ్యూటీ పర్ఫెక్ట్ గా చేస్తున్నట్టుగా అర్థమవుతుంది. తప్పకుండా చిరు సినిమాకు భీంస్ మ్యూజిక్ అసెట్ అయ్యేలా ఉంది. ఈ సినిమా తర్వాత భీమ్స్ కూడా స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ గా అదరగొట్టేసే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. భీమ్స్ కూడా చిరంజీవి సినిమాకు తన సూపర్ కంపోజిషన్ తో మెగా ఫ్యాన్స్ ని మెప్పించాలని చూస్తున్నాడు. చిరు సినిమా టెస్ట్ పాస్ ఐతే మాత్రం అనిల్ రావిపూడి అన్ని సినిమాల్లో అతన్ని రిఫర్ చేసే ఛాన్స్ ఉంటుంది. తెలుగు స్టార్ సినిమాల్లో మ్యూజిక్ అంటే దేవి శ్రీ ప్రసాద్, థమన్ పేర్లు మాత్రమే ముందు వినిపిస్తాయి. రాజమౌళి సినిమాలకు కీరవాణి ఫిక్స్ అయ్యాడు. సో కొత్త మ్యూజిక్ డైరెక్టర్ భీంస్ అఫ్కోర్స్ ఆల్రెడీ హిట్ ఫాం లో పాత వాడయ్యాడు కాబట్టి కచ్చితంగా అతనికి ఈ మెగా మూవీ మంచి జోష్ ఇస్తుందని చెప్పొచ్చు.



# ఓజీ జపాన్ రిలీజ్.. సందిగ్ధత వీడేనా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఓజీ మూవీ సెప్టెంబర్ 25న థియేటర్లలోకి వచ్చి పవన్ ఫ్యాన్స్ కి కొత్త ఊపునిచ్చింది. హరిహర వీరమల్లు సినిమాతో నిరాశ పడ్డ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కి ఓజీ మూవీ కొత్త ఉత్సాహాన్ని నింపింది అని చెప్పుకోవచ్చు. అయితే అలాంటి ఓజీ మూవీ సెప్టెంబర్ 25న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఊచకోత కోసింది. అలాంటి ఈ మూవీలో జపనీస్ నేపథ్యం కూడా ఉంది. అయితే ఈ సినిమాని జపాన్ లో విడుదల చేసే యోచన కూడా ఉన్నట్టు ఆ మధ్యకాలంలో వార్తలు వినిపించాయి. మరి అలాంటి ఓజీ మూవీ జపాన్ లో విడుదలకు వీలవుతుందా.. మేకర్స్ ఎలాంటి ప్లాన్ చేయబోతున్నారు అనేది ఇప్పుడు చూద్దాం.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా.. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా తెరకెక్కిన ఓజీ మూవీ సెప్టెంబర్ 25న థియేటర్లలోకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయింది.అంతేకాదు ఈ సినిమాకి ఓటీటీలో కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే అలాంటి ఈ సినిమాని జపాన్ లో విడుదల చేసే అవకాశాలు ఉన్నట్టు వార్తలు వినిపించినా.. ఇప్పటి వరకు ఓజీ మూవీ జపాన్ లో విడుదల గురించి ఎలాంటి వార్తలయితే వినిపించడం లేదు. కానీ ఈ సినిమాకి డైరెక్షన్ చేసిన సుజీత్ గతంలో సాహో మూవీని జపాన్ లో విడుదల చేసి మంచి కలెక్షన్స్ వసూల్ చేశారు. జపనీస్ నేపథ్యం లేని సాహో మూవీనే జపాన్ లో విడుదల చేసి హిట్ కొట్టారు. అలాంటిది జపనీస్ నేపథ్యం ఉన్న ఓజీ సినిమాని జపాన్ లో విడుదల చేసి హిట్ కొట్టలేరా అని చాలామంది భావించారు. పైగా ఓజి మూవీలో జపనీస్ నేపథ్యం ఉన్నప్పటికీ.. జపాన్లో జపనీస్ తో ఎలాంటి సంబంధం లేని సినిమాలే ఎక్కువగా హిట్ అవుతాయని, అక్కడి నేపథ్యంతో కనెక్టివిటీ లేని సినిమాలే అక్కడి ప్రేక్షకుల ఆదరణని పొందుతాయని తెలుస్తోంది. మరి ఇలాంటి టాక్ ఉన్న నేపథ్యంలో ఓజీ సినిమాని అక్కడ విడుదల చేస్తే హిట్ అవుతుందా అనే ఆలోచనలో పడ్డారట మేకర్స్.. అంతేకాదు సాలిడ్ ఎలిమెంట్స్ ఉన్న ఓజీ మూవీ జపాన్ లో విడుదల చేస్తే కచ్చితంగా హిట్ అవ్వదు అని కొంతమంది భావిస్తున్నారట. అందుకే జపనీస్ నేపథ్యం ఉన్నప్పటికీ కూడా ఓజీ మూవీని జపాన్ లో విడుదల చేయడానికి మేకర్స్ ముందుకు రావడం లేదట. మరి చూడాలి భవిష్యత్తులో అయినా ఓజీ మూవీని జపాన్ లో విడుదల చేస్తారా లేదా అనేది.. ఇక ఓజీ మూవీ విషయానికి వస్తే.. సుజీత్ డైరెక్షన్లో వచ్చిన ఈ సినిమాని డివివి దానయ్య నిర్మించారు. అలాగే ఈ సినిమాకి ఎస్ఎస్ తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ లు కీ రోల్స్ పోషించారు.




# ఫ్లాపుల్లో లీలమ్మ డబుల్ హ్యాట్రిక్


టాలెంట్, గ్లామర్, మంచి డ్యాన్సులు.. వీటన్నింటితో పాటూ చక్కగా మాతృభాషలో మాట్లాడే తెలుగమ్మాయి శ్రీలీల. పెళ్లి సందడి2 తో టాలీవుడ్ లో కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీలీల ఆ సినిమాలో తన యాక్టింగ్, డ్యాన్సులతో అందరినీ మెప్పించింది. తర్వాత రవితేజతో ధమాకా సినిమా చేసింది. ఆ సినిమా మంచి హిట్ గా నిలవడంతో శ్రీలీలకు ఆఫర్లు క్యూ కట్టాయి. మాస్ జాతరపై భారీ ఆశలు ఒకనొక టైమ్ లో శ్రీలీల నుంచి నెలకో సినిమా రిలీజైంది. అయితే లీలకు ఆఫర్లైతే వస్తున్నాయి కానీ అవేవీ తన కెరీర్ ను నెక్ట్స్ స్టేజ్ కు తీసుకెళ్లలేకపోతున్నాయి. ప్రస్తుతం శ్రీలీల బ్యాడ్ టైమ్ కంటిన్యూ అవుతుంది. హిట్ కొట్టాలని ఎంతో ఆశగా ఉన్న అమ్మడి కోరిక ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. శ్రీలీల నుంచి వచ్చిన సినిమాలన్నీ వరుస ఫ్లాపులవడంతో రవితేజతో చేసిన మాస్ జాతరపై అమ్మడు భారీ ఆశలే పెట్టుకుంది.శ్రీలీల ఖాతాలో ఎక్కువ ఫ్లాపులే.. రవితేజ, శ్రీలీల కాంబినేషన్ లో గతంలో వచ్చిన ధమాకా బ్లాక్ బస్టర్ అవడంతో మాస్ జాతర కూడా అదే స్థాయి సక్సెస్ ను అందుకుంటుందని భావిస్తే, అంచనాలను తలకిందులు చేస్తూ ఆ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఫలితంగా శ్రీలీల ఖాతాలో మరో ఫ్లాప్ నమోదైంది. అయితే శ్రీలీల ఫిల్మోగ్రఫీని చూసుకుంటే అమ్మడి ఖాతాలో ఎక్కువగా ఫ్లాపులే ఉన్నాయనేది స్పష్టమవుతుంది. ధమాకా తర్వాత శ్రీలీల సోలో హీరోయిన్ గా వచ్చిన సినిమా ఏదీ సూపర్ హిట్ అయింది లేదు. పెళ్లి సందడి హిట్టవగా, ధమాకా బ్లాక్ బస్టర్ అయింది. తర్వాత రామ్ పోతినేనితో చేసిన స్కంద ఫ్లాపుగా నిలిచింది. నందమూరి బాలకృష్ణతో చేసిన భగవంత్ కేసరి హిట్టైనప్పటికీ ఆ సక్సెస్ బాలయ్య, అనిల్ ఖాతాలోకి వెళ్లింది.



# శివ రీరిలీజ్ ట్రైలర్.. గూస్‌బంప్స్ గ్యారెంటీ!




టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్లో కల్ట్ క్లాసిక్ మూవీ శివ. సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తెలుగు సినీ ఇండస్ట్రీలో ఎన్నో రికార్డులు సృష్టించింది. ఎవర్ గ్రీన్ ఫిల్మ్ గా నిలిచిపోయిన ఈ సినిమా అప్పటివరకు ఓ మూస ధోరణిలో వెళ్తున్న ఇండస్ట్రీకి సరికొత్త బాటలు వేసింది. శివ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఎన్నో మార్పులొచ్చాయి ట్రెండ్ సెట్టర్ గా నిలిచిన శివ దర్శకులు సినిమా తీసే విధానాన్ని, ఆడియన్స్ సినిమా చూసే విధానాన్ని శివ మూవీ పూర్తిగా మార్చేసింది. అందుకే తెలుగు మూవీ గురించి మాట్లాడాల్సి వస్తే ఇప్పటికీ శివకు ముందు, శివకు తర్వాత అని అంటుంటారు. అంతటి ట్రెండ్ సెట్టర్ మూవీ ఇప్పుడు మరోసారి థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. 1989లో రిలీజైన ఈ మూవీ ఇప్పుడు 4కె ఫార్మాట్ రిలీజ్ కావడానికి ముస్తాబవుతుంది. నవంబర్ 14న శివ రీరిలీజ్ శివ మూవీని రీరిలీజ్ చేయమని ఫ్యాన్స్ ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ అది కుదరలేదు. టాలీవుడ్ లో ఏ సినిమా రీరిలీజైనా శివ రీరిలీజ్ ఎప్పుడని ప్రశ్నించేవారు అభిమానులు. వాస్తవానికి అటు నాగ్, ఇటు ఆర్జీవీ కూడా ఎప్పట్నుంచో ఈ మూవీని రీరిలీజ్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు కానీ వీలవలేదు. కొన్ని నెలలుగా శివ మూవీని రీమాస్టరింగ్ చేస్తున్న చిత్ర యూనిట్ నవంబర్ 14న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ఈ రీరిలీజ్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ను నార్మల్ ట్రైలర్ లాగా కాకుండా ముందుగా టాలీవుడ్ లోని కొందరు సెలబ్రిటీల వీడియో బైట్స్ తో మొదలుపెట్టారు. శివ గురించి ఆ సెలబ్రిటీలు చెప్పిన గొప్ప మాటలను ట్రైలర్ కు జోడించి దాన్ని మరింత స్పెషల్ గా మార్చగా, ఈసారి శివ 4కె అట్మాస్ లో రీరిలీజ్ కానున్నట్టు క్లారిటీ ఇచ్చారు మేకర్స్.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**